teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 245 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 7 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## హన్మకొండలో 50 ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

సంక్రాంతి లోపు రోడ్డెక్కనున్న మరో 25 బస్సులు




## ఎన్నికల షెడ్యూల్ రాకముందే ముమ్మరంగా ఏర్పాట్లు

### ఓటర్ల జాబితా విడుదలతో పార్టీలలో హడావిడి




తెలంగాణ బ్యూరో, జనవరి 06 (తీన్మార్ న్యూస్): పంచాయతీల ఎన్నికలకు షెడ్యూల్ రాకముందే అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఈ నివేదికలో తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 3,35,27,925 ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో పురుష ఓటర్లు 1,66,41,489 మంది, మహిళా ఓటర్లు 1,68,67,735 మంది, థర్డ్ జండర్ ఓటర్లు 2,829 మంది

మిగతా 2 లో



## దడపుట్టిస్తున్న హెచ్ఎంపీవీ కొత్త వైరస్



### భారత్ లో పెరుగుతున్న ఆందోళన

### ఒక్కరోజే ఆరు కేసులు నమోదు

- దాదాపు చిన్న పిల్లలకే హెచ్ఎంపీవీ వైరస్ పాజిటివ్
- వారికి ఎలా సోకింది.. వైద్య నిపుణులు దర్యాప్తు
- హెచ్ఎంపీవీ వైరస్‌పై కేంద్రం కీలక ప్రకటన

న్యూ ఢిల్లీ, జనవరి 06 (తీన్మార్ న్యూస్): చైనాలో పుట్టిన మరో కొత్త వైరస్ దడపుట్టిస్తోంది. భారత్ లో కూడా హెచ్ఎంపీవీ వైరస్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భారత్‌లో ఒక్కరోజే ఆరు కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలోని బెంగళూరులో 2, గుజరాత్ లోని అహ్మదాబాద్ లో 1, బెంగాల్‌లోని కోల్‌కతాలో 1, చెన్నైలో 2 కేసులు నమోదయ్యాయి. దాదాపు అందరూ చిన్న పిల్లలకే హెచ్ఎంపీవీ వైరస్

మిగతా 2 లో

## ఆక్రమణలపై నేరుగా ఫిర్యాదుల స్వీకరణకు హైడ్రా నిర్ణయం



### తొలిరోజే ఫిర్యాదులతో పోటెత్తిన ప్రజలు

హైదరాబాద్, జనవరి 06 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పార్కులు, స్థలాలు, చెరువులకు సంబంధించి ఆక్రమణలపై నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని హైడ్రా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా సోమవారం హైడ్రా కార్యాలయంలో చీఫ్ ఫిర్యాదులు తీసుకున్నారు. తొలిరోజే ప్రజలు ఫిర్యాదులతో హైడ్రా కార్యాలయానికి పోటెత్తారు. మొదటి రోజు 83 ఫిర్యాదులను

మిగతా 2 లో

## జవాన్ల మరణం బాధాకరం

### ఇంతకు ఇంత ప్రతీకారం తీర్చుకుంటాం

జవాన్లు మృతిపై స్పందించిన కేంద్ర మంత్రి అమిత్ షా



తెలంగాణ బ్యూరో, జనవరి 06 (తీన్మార్ న్యూస్): ఛత్తీస్‌గఢ్ లో సోమవారం మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి 9 మంది జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

మిగతా 2 లో

## 13 నెలలు అవుతున్నా మొదటి హామీకే దిక్కులేదు

### షేమ్ అంటూ ఎక్స్ వేదికగా ట్విట్

కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ మాజీ మంత్రి హరీష్ రావు



హైదరాబాద్, జనవరి 06 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో 2023 డిసెంబర్ 7న 125 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ ప్రమాణస్వీకారం చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి మాత్రం పదవిలోకి వచ్చి 13 నెలలు అవుతున్నా

మిగతా 2 లో



## చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభించిన ప్రధాని

### ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది: సీఎం రేవంత్

తెలంగాణ బ్యూరో, జనవరి 06 (తీన్మార్ న్యూస్): చర్లపల్లి టెర్మినల్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా చర్లపల్లి రైల్వే టెర్మినల్

మిగతా 2 లో

## రాష్ట్రంలో పెరుగుతున్న చలి తీవ్రత

### మూడు రోజులలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

సాధారణం కంటే నాలుగు డిగ్రీల తక్కువ నమోదుకు అవకాశం



.. వివరాలు 2లో



## నటుడు మోహన్‌బాబు విజ్ఞప్తికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

### పాస్ ఓవర్ కు ధర్మాసనం అంగీకారం

తెలంగాణ బ్యూరో, జనవరి 06 (తీన్మార్ న్యూస్): నటుడు మంచు మోహన్ బాబు విజ్ఞప్తికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫ్యామిలీ వివాదంలో జరిగిన ఘటనలపై

మిగతా 2 లో



## రక్షణ రంగ సంస్కరణల సంవత్సరంగా 2025

### ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూ ఢిల్లీ, జనవరి 06 (తీన్మార్ న్యూస్): భారత సైన్యాన్ని అత్యాధునిక సాంకేతిక పోరాట శక్తిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 2025లో రక్షణ రంగంలో కీలక సంస్కరణలు తీసుకువచ్చేందుకు 2025ను రక్షణ రంగ సంస్కరణల సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. త్రివిధ దళాల మధ్య సయోధ్య పెంచేందుకు మరిన్ని సమీకృత

మిగతా 2 లో

## కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ అధికారుల నోటీసులు




### ఈనెల 9న విచారణకు హాజరు కావాలని ఆదేశం

హైదరాబాద్, జనవరి 06 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈనెల 9వ తేదీన విచారణకు హాజరు కావాలని సోమవారం సాయంత్రం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గచ్చిబౌలి లోని కేటీఆర్ నివాసంలో ఏసీబీ

మిగతా 2 లో

**కేటీఆర్ నివాసంలో ఏసీబీ సోదాలు**



**ఈ కార్ రేసు కేసులో సంచలన పరిణామం**



## ఆరంఘర్ ఫ్లైఓవర్ కు మన్మోహన్ సింగ్ పేరు పెట్టుటకు నిర్ణయం

### రూ.799 కోట్లతో 6 లైన్ల ఫ్లైఓవర్ నిర్మాణం


హైదరాబాద్, జనవరి 06 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ప్రారంభించిన ఆరంఘర్ ఫ్లైఓవర్ కు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించింది. రూ.799 కోట్ల జీహెచ్ఎంసీ నిధులతో ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూపార్క్ వరకూ 6 లైన్ల ఫ్లైఓవర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2 లో



# దడపుట్టిస్తున్న "హెచ్ఎంపీవీ" కొత్త వైరస్

మొదటి పేజీ తరువాయి
పాజిటివ్ గా నమోదైంది. అయితే పిల్లలకు ఎవరికీ విదేశీ పర్యటన చరిత్ర లేదు. వారికి ఎలా సోకింది అనే విషయాలపై వైద్య నిపుణులు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారులను ప్రత్యేక వార్డుల్లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ వైరస్ తో ఆందోళన అవసరం లేదని అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.



## హెచ్ఎంపీవీ వైరస్‌పై కేంద్రం కీలక ప్రకటన

హెచ్ఎంపీవీ వైరస్‌పై ఆందోళన అక్కర్లేదని కేంద్రం కీలక ప్రకటన చేసింది. హెచ్ఎంపీవీ వైరస్‌పై చాలా అప్రమత్తంగా ఉన్నామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. ఈ వైరస్ కొత్తది కాదని, 2001 లోనే గుర్తించారని వెల్లడించారు. అయినప్పటికి ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని తెలిపారు. పొరుగుదేశాల్లో ముఖ్యంగా చైనాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని వెల్లడించారు. ఈనెల 4వ తేదీన కేంద్ర ఆరోగ్యశాఖ హెచ్ఎంపీవీ వైరస్‌పై కీలక సమీక్ష నిర్వహించినట్టు చెప్పారు.


## లాక్ డౌన్ తప్పదా..

కాగా భారత్ లో కేసులు పెరుగుతుండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. హెచ్ఎంపీవీ వైరస్ కేసులతో దేశంలో మళ్లీ లాక్ డౌన్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు సోషల్ మీడియా వేదికగా చాలా మంది పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ వైరస్ కేసులు పెరుగుతున్న తీరుపై సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ లో లాక్డౌన్ టాప్ ట్రెండింగ్ లో నిలిచింది.

## కరోనా లాంటి లక్షణాలు

ఈ కొత్త వైరస్‌లో దాదాపు కరోనా వైరస్ లాంటి లక్షణాలే ఉన్నాయి. ఇది ఒకరి నుండి ఒకరికి వేగంగా వ్యాపిస్తుంది. తుమ్ము, దగ్గు, లాలాజలం ద్వారా వ్యాప్తి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. కరోనా లాగే గాలి ద్వారా వ్యాపించగలదని డాక్టర్లు చెబుతున్నారు. ఇది న్యుమోనియా, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు కారణం అవుతుందని చెబుతున్నారు. ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారులు, ముఖ్యంగా శిశువులు అలాగే 65 ఏళ్ల పైబడిన వృద్ధుల్లో ఈ వైరస్ లక్షణాలు త్వరగా కనిపిస్తాయంటున్నారు డాక్టర్లు. దీర్ఘకాలిక వ్యాధులు, టీబీ, శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్, హెచ్ఐవీ వంటి వ్యాధులతో బాధపడేవారికి, ఇది ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

# ఎన్నికల షెడ్యూల్ రాకముందే ముమ్మరంగా ఏర్పాట్లు



మొదటి పేజీ తరువాయి
ఉన్నట్లు తెలిపారు. అలాగే యువ ఓటర్లు (వయస్సు 18-19 సంవత్సరాలు) 5,45,026 మంది, సీనియర్ ఓటర్లు (వయస్సు 85, అంతకంటే ఎక్కువ) 2,22,091 మంది, ఓవర్సీస్ (ఎన్ఆర్ఐ) ఓటర్లు 3,591 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 5,26,993 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇకపోతే, ఈ ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల అధికారులు పంచాయతీల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని విడుదల చేసినట్లుగా కనపడుతోంది. రాష్ట్ర ఎన్నికల అధికారులు ఇప్పుడు ఓటర్ల జాబితా విడుదల చేయడంతో రాష్ట్రంలోని పార్టీలలో మరోసారి ఎన్నికల హడావిడి కానుంది.

# ఆక్రమణలపై నేరుగా ఫిర్యాదుల స్వీకరణకు హైడ్రా నిర్ణయం

మొదటి పేజీ తరువాయి
హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వీకరించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైడ్రా ప్రజావాణి కొనసాగింది. ఫిర్యాదులను పరిశీలించి మూడు వారాల్లో చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగనాథ్ బాధితులకు భరోసా ఇచ్చారు. చెరువులు, పార్కులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేశారని ఎక్కువగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. మరోవైపు సంక్రాంతి పండుగ నుంచి హైడ్రా పోలీస్‌స్టేషన్ ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే హైడ్రా పీఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓకే చెప్పిన విషయం తెలిసిందే. ఇకపై హైడ్రాకు సంబంధించిన కార్యకలాపాలు పూర్తిగా కూడా హైడ్రా పోలీస్‌స్టేషన్ ద్వారా నిర్వహించేందుకు వీలుగా హైడ్రా కమిషన్ రంగనాథ్ నిర్ణయం తీసుకున్నారు.

# జవాన్ల మరణం బాధాకరం

మొదటి పేజీ తరువాయి
స్పందించారు. జవాన్ల మరణం బాధాకరం అని తెలిపిన అమిత్ షా వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జవాన్ల బలిదానాలు ఊరికే పోవని, ఇంతకు ఇంత ప్రతీకారం తీర్చుకుంటామని అన్నారు. భారత్ లో మావోయిస్టులు అనే పేరే లేకుండా చేస్తామని, 202 వరకు మావోయిస్టు రహిత భారత్‌ను నిర్మిస్తామని పేర్కొన్నారు. కాగా సోమవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జవాన్లు ప్రయాణిస్తున్న మార్గంలో ఐఈడీ బాంబులు అమర్చి వారి వాహనాన్ని పేల్చేశారు. ఈ ఘటనలో 9 మంది అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని బీజాపూర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తునారు. ఈ ఘటనతో ఛత్తీస్‌గఢ్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

# రక్షణ రంగ సంస్కరణల సంవత్సరంగా 2025



మొదటి పేజీ తరువాయి
థియేటర్ కమాండ్ల ఏర్పాటు దిశగా రక్షణశాఖ సంస్కరణలు చేపట్టనున్నది. భవిష్యత్తులో జరిగే ఆపరేషన్ల అవసరాలకు తగినట్లు దళాల మధ్య సమన్వయం, సహకారం పెంపొందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురానున్నది. యుద్ధ అవసరాలకు తగినట్లు వెంటనే ఆయుధాలను సమకూర్చుకోవడం, అభివృద్ధి చేయడానికి వీలుగా కీలకమైన పలు ఆయుధ కొనుగోళ్ల ప్రక్రియను సరళీకరించనున్నది. 2025లో సైబర్ సెక్యూరిటీ, అంతరిక్షం, కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, హైపర్ సోనిక్ రోబోటిక్స్ రంగాలపై దృష్టి సారించనున్నది. 21వ శతాబ్దంలో ఎదురయ్యే సవాళ్ల సన్నద్ధతకు ఈ సంస్కరణలు దోహదపడుతాయి.

# కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ అధికారుల నోటీసులు

మొదటి పేజీ తరువాయి
అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అయితే తన ఇంట్లో ఏసీబీ సోదాలు జరుగుతాయని సోమవారం ఉదయమే కేటీఆర్ మీడియాతో చెప్పటం గమనార్హం. ఆయన చెప్పినట్టుగానే ఏసీబీ అధికారులు సాయంత్రానికి ఆయన నివాసంలో సోదాలకు పాల్పడటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు సోదాలు జరుగుతుండగానే మరోవైపు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఫార్ములా ఈ రేసు కేసులో ఇప్పటికే కేటీఆర్‌ను ఏ1గా పేర్కొనగా ఏసీబీ, ఈడీ వం-సగా నోటీసులు జారీ చేస్తోంది. సోమవారం ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు వెళ్లిన కేటీఆర్ తన లాయర్‌ను అనుమతించలేదన్న కారణంతో తిరిగి వచ్చేసిన విషయం తెలిసిందే.

# కేటీఆర్ నివాసంలో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, జనవరి 06 (తీన్మార్ న్యూస్): ఈ కార్ రేసు కేసులో మరో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. గచ్చిబౌలిలోని ఓరియన్ విల్లాస్ లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ నెల 2న తేదీన ఇచ్చిన నోటీసుల మేరకు సోమవారం కేటీఆర్ విచారణ నిమిత్తం ఏసీబీ కార్యాలయానికి వెళ్లిన సంగతి తెలిసిందే. అక్కడ తన న్యాయవాదితో కలిసి విచారణకు పోలీసులు అనుమతి ఇవ్వక పోవడంతో తన వివరణతో కూడిన లేఖను అధికారులకు అందజేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే తన ఇంట్లో ఏసీబీ రెయిడ్స్ జరుగుతాయని సోమవారం ఉదయమే కేటీఆర్ మీడియాతో చెప్పారు. కేటీఆర్ చెప్పినట్లుగానే సాయంత్రానికి తనిఖీలు జరుగుతుండటం విశేషం.



# చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభించిన ప్రధాని

మొదటి పేజీ తరువాయి
ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొని ప్రసంగించారు. రైల్వే టెర్మినల్ పూర్తి చేసినందుకు ప్రధానికి తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. బందర్ పోర్ట్‌కు రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో డ్రైపోర్ట్ ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణ ఫార్మా ఇండస్ట్రీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉందన్నారు. ఎలక్ట్రిక్ వేహికిల్ తయారీకి అనుమతి ఇవ్వాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు 374 కిలోమీటర్ల నిర్మాణం జరుగుతోందని రీజనల్ రైల్ అవసరం కూడా ఉందన్నారు. రైల్ రింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. వికారాబాద్ నుంచి కొడంగల్ మీదుగా కర్ణాటకకు రైల్వే లైన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రధాని కోరుకుంటున్న 5 ట్రిలియన్ ఎకానమీ సకారం కావాలంటే అన్ని రాష్ట్రాల అభివృద్ధి జరగాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటుందన్నారు. డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తే రాష్ట్రాభివృద్ధికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. 1 ట్రిలియన్ ఎకానమి కాంట్రిబ్యూట్ చేసేందుకు తమకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని ప్రధాన మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కాగా సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. అలాగే జనవరి 7 నుంచి సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్- గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళ్లు (12603-12604) మార్చి 7 నుంచి,. గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.




## ఆరంఘర్ ఫ్లైఓవర్ కు మన్మోహన్ సింగ్ పేరు పెట్టుటకు నిర్ణయం

మొదటి పేజీ తరువాయి
నిర్మించింది. 4.08 కిలోమీటర్ల పొడువు, 23 మీటర్ల వెడల్పుతో అధికారులు దీన్ని నిర్మించారు. నగరంలో పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తర్వాత ఇదే రెండో అతి పెద్ద ఫ్లైఓవర్. కాగా, సోమవారం మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులతో కలిసి దీన్ని ఘనంగా ప్రారంభించారు. ఫ్లై ఓవర్ ప్రారంభం కావడంతో నగరంలో ట్రాఫిక్ కష్టాల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. ఆరాంఘర్ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బెంగళూరు హైవే నుంచి హైదరాబాద్ నగరంలోకి ట్రాఫిక్ అంతరాయం లేకుండా తేలికగా ప్రవేశించవచ్చు. అలాగే ఎంజీబీఎస్ బహదూర్‌పుర నుంచి ఎయిర్‌పోర్ట్, బెంగళూరు హైవేకు ఈజీగా వెళ్లొచ్చు. తాడ్ బన్ జంక్షన్, దానమ్మ హాట్స్, శాస్త్రీపురం, హసన్ నగర్, శివరాంపల్లి జంక్షన్ల వద్ద ట్రాఫిక్ చిక్కులు లేకుండా ఫ్లైఓవర్ పైనుంచి నగర వాసులు సులభంగా ప్రయాణించవచ్చు. ఎస్ఆర్డీపీ కింద నిర్మిస్తున్న 42 ప్రాజెక్టుల్లో ఇప్పటివరకూ 36 ఫ్లైఓవర్లు, అండర్ పాసులు అందుబాటులోకి వచ్చాయి. కాగా, 37వ ప్రాజెక్టుగా ఆరాంఘర్-జూ పార్క్ ఫ్లైఓవర్ తాజాగా అందుబాటులోకి వచ్చింది.

## హన్మకొండలో 50 ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

హన్మకొండ, జనవరి 06 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా హయగ్రీవ గ్రౌండ్‌లో ఆర్టీసీ 50 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ హాజరయ్యారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు. వరంగల్‌కి 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించింది ప్రభుత్వం. మొదటి దశగా సోమవారం 50 ఎలక్ట్రిక్ బస్సులను మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ జెండా ఊపి ప్రారంభించారు. సంక్రాంతి లోపు మరో 25 బస్సులు రోడ్డెక్కనున్నాయి. అంతరం మిగిలిన బస్సులను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. ఇప్పటి వరకు 125 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. మహిళలు 4350 కోట్ల రూపాయల విలువైన ప్రయాణం ఉచితంగా చేశారని అన్నారు. ఆక్యుపెన్సీ గతంలో కంటే రెట్టింపు అయింది. ఆర్టీసీ ఉద్యోగుల వల్లే సాధ్యం అవుతుంది. వారు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఆర్టీసీ ఉద్యోగులు బస్ కా పెయ్య నై చెలిగ అనే ఉద్యమాన్ని చేపట్టారని అన్నారు. వారికి 2013 బాండ్స్ ఇచ్చాం 21 శాతం పీఆర్సీ ఇచ్చాం ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టాం 3 వేల ఉద్యోగాలకు నియామకాలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు రాష్ట్రంలో ప్రారంభించుకున్నామని చెప్పారు. ఆర్టీసీ ప్రజలది ఆర్టీసీని కాపాడుకొని ముందుకు తీసుకుపోయి బాధ్యత అందరిపై ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రజల కోసం ఆర్టీసీ మరిన్ని చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు.




# నటుడు మోహన్ బాబు విజ్ఞప్తికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్ జల్ల పల్లిలో మోహన్ బాబుపై కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో తాజాగా విచారణ జరిగింది. అయితే మోహన్ తరపున వాదించే సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి అందుబాటులో లేక పోవడంతో విచారణపై పాస్ ఓవర్ కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించింది. దీంతో తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. కాగా ఆస్తుల విషయంలో ఇటీవల మోహన్‌బాబు ఫ్యామిలీలో వివాదం నెలకొంది. తండ్రి మోహన్ బాబు ఆస్తుల కోసం తనయులు మంచు విష్ణు, మనోజ్ మధ్య పెద్ద పంచాయతీనే జరిగింది. జల్లపల్లిలోని మోహన్ బాబు నివాసానికి వెళ్లేందుకు మంచు మనోజ్ ప్రయత్నం చేశారు. దీంతో మనోజ్‌ను మంచు విష్ణు అనుచరులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ జరిగింది. అయితే ఈ వివాదంపై న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి చేశారు. దీంతో మంచు మోహన్ బాబుపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో మోహన్ బాబుకు ఎదురు దెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ మోహన్ బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న చలి తీవ్రత

తెలంగాణ బ్యూరో, జనవరి 06 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో చలి తీవ్రత కొనసాగుతోంది. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్‌జిల్లాలలో మంగళ, బుధ, గురువారం ఈ మూడు రోజులలో అత్యల్ప ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని తెలంగాణ వాతావరణ శాఖ సంచాలకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతేగాకుండా నేడు, రేపు తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుందని, రాబోయే 3 రోజులు రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదే సందర్భంలో దక్షిణ, ఆగ్నేయ దిశల నుండి కూడా ఈ మూడు రోజులు చలి గాలులు కూడా వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

# 13 నెలలు అవుతున్నా మొదటి హామీకే దిక్కులేదు

మొదటి పేజీ తరువాయి
మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ప్రతినెల ₹2500 ఇస్తామని చెప్పిన మొట్టమొదటి హామీకే దిక్కులేకుండా పోయిందని మాజీ మంత్రి తన్నీరుహరీష్ రావు మండిపడ్డారు. షేమ్ అంటూ సోమవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 2024 డిసెంబర్ 9న జారండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జేఎంఎం ముఖ్యమంత్రి, అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా కాకముందే ఇచ్చిన మాట ప్రకారం 'మాయా సమ్మాన్' పథకం కింద నెలకు ₹2,500 మహిళలకు ఇస్తున్నారన్నారు.



తీన్మార్
తెలుగు దినపత్రిక

## డాలర్ డ్రీమ్స్ కు కష్టాలు...

అమెరికాలో 1958లో కేవలం 12,000 మంది మాత్రమే ప్రవాస భారతీయులు ఉండేవారు. రానురాను వారి ప్రాముఖ్యత పెరిగి ఇప్పుడు అమెరికా మొత్తం జనాభాలో 1.5% వరకు ప్రవాస భారతీయులు ఉనికిని పొందడం విశేషం. సిఇఒలుగా, సైంటిస్టులుగా, ఆస్ట్రోనాట్లుగా, విధానపర నిర్ణేతలుగా, చట్టసభ సభ్యులుగా ఇలా అనేక రంగాల్లో ప్రవాస భారతీయులు విస్తరిస్తుండటంతో అమెరికాలో పుట్టి పెరిగిన అసలైన అమెరికన్లకు దక్కవలసిన ఉద్యోగాలు, పదవులు ప్రవాసీయులకే దక్కుతున్నాయన్న అపోహలు మొదలవుతున్నాయి. ఇది చివరకు హెచ్1బి వీసాలపై ప్రభావం చూపిస్తోంది. మేక్ ఎగైన్ గ్రేట్ అమెరికా 'మాగా' నినాదంతో రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు హెచ్1బి వీసాల వివాదం అగ్నిపరీక్షగా మారింది.ప్రవాసీయుడైన ఎలాన్ మస్క్‌కు పెద్ద పీట వేయడం వివాదాస్పదమవుతోంది.ఇది మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) అన్న ట్రంప్ ప్రధాన నినాదానికి తూట్లు పొడుస్తోంది. న్యూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిసియెన్సీ(డిఒజిఇ) అధినేతగా ఎలాన్‌మస్క్, ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్, పౌరహక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్ కె ధిల్లాన్, జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్‌గా డాక్టర్ జయభట్టాచార్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సీనియర్ పాలసీ అడ్వైజర్ శ్రీరామ్ క్రిష్ణన్‌తో పాటు వివేక్ రామస్వామి వంటి భారతీయ మూలాలున్న ఆరుగురిని ట్రంప్ తన యంత్రాంగంలో కీలక స్థానాల్లో నియమించారు. ఇది 'మాగా' నినాదానికి విరుద్ధమని వలసవాద, ఇస్లామిక్ వ్యతిరేక ఉద్యమ నేత లారా లూమెర్ ధ్వజమెత్తుతున్నారు.ట్రంప్ నియమించిన వారిలో శ్రీరామ్ క్రిష్ణన్ చెన్నైకు చెందినవారు. ఇండియా ఫస్ట్ అన్న నినాదానికి ఆయన కట్టుబడి ఉన్నారని, ఇది 'అమెరికా ఫస్ట్ అన్న లక్ష్యానికి వ్యతిరేకమని లారా లూమెర్ ఆగ్రహిస్తున్నారు. అయితే హెచ్1బి వీసాల్లో 70% భారతీయులే పొందుతున్నారని, వీరంతా భారత్ నుంచి వచ్చే మూడో ప్రపంచ ఆక్రమణదారులని లూమెర్ ఆరోపిస్తున్నారు. హెచ్1బి వీసాదారుల్ని కాంట్రాక్టుగా తీసుకోవడంలో ఎలాంటి ప్రత్యేక నైపుణ్య ప్రమాణాలు కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. పైగా ఏటా వారికి 80 వేల డాలర్ల నుంచి 1,20,000 డాలర్ల వరకు చెల్లించుకోవలసి వస్తోందని నిలదీస్తున్నారు. ఈ వాదాన్ని వివేక్ రామస్వామి, ఎలాన్ మస్క్ తదితరులు తిప్పికొడుతున్నారు.వాస్తవానికి ఎలాన్ మస్క్ దక్షిణాఫ్రికా నుంచి అమెరికాకు హెచ్1బి వీసా పైనే వచ్చారు.విదేశీ ప్రతిభతో అమెరికా ప్రయోజనం పొందుతుంది తప్ప అమెరికా వాసుల ప్రయోజనాలకు, హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని మస్క్, రామస్వామి తమ వాదన వినిపిస్తున్నారు. చేతిలోపైసా లేకుండా అమెరికాకు వలస వచ్చిన గొప్ప ఇంజినీర్ నికోలా టెస్లా స్ఫూర్తితోనే తన కారుకు టెస్లా అని పేరు పెట్టినట్టు మస్క్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికాలో విద్యుత్ విప్లవానికి నికోలా టెస్లా మూలకారకుడని మస్క్ ఉదహరించారు. అమెరికాకు సమర్థత కలిగిన ప్రజలు కావాలని తానెల్లప్పుడూ భావిస్తానని, తెలివైనవారు మన దేశానికి రావాలని, ఇదివరకెన్నడూ లేని స్థాయిలో అమెరికాలో ఉద్యోగాలు రాబోతున్నాయని కొత్త సంవత్సరం సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడడం ఈ సందర్భంగా గమనించాల్సిన విషయం. అమెరికా తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తున్నందున ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గల వారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్1బి వీసా ఉపయోగపడుతుందని మస్క్, వివేక్ రామస్వామి కూడా పేర్కొంటున్నారు.ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటి స్థానంలో ఉండాలంటే ఈ ప్రోగ్రాంకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలికగా నియమించుకోడానికి అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం నిబంధనల్లో మార్పులు చేసింది. ట్రంప్ మొదటిసారి పాలనలో వీసాలపై ఉన్న అభిప్రాయాలకు ఇప్పటి వైఖరికి తేడా కనిపిస్తోంది. 2017లో బై అమెరికన్, హైర్ అమెరికన్ అన్న సిద్ధాంతానికి వత్తాసు పలికారు. ఫలితంగా 2015 నుంచి హెచ్1బి వీసాల మంజూరు మందగించింది. 2020లో అమెరికాలోని సంస్థలు విదేశాల నుంచి ఉద్యోగులు, కార్మికులను తెచ్చుకునే విధానానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నిలకడ లేని విధానాలతో మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) మద్దతుదారులు హెచ్1బి వీసా అసలు ప్రయోజనాలను తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.ఈ సమస్యను ట్రంప్ ఈసారి ఎలా పరిష్కరిస్తారో చూడాలి. హెచ్1బి వీసాలపై ఆంక్షలు ఎక్కువ చేస్తే అమెరికా కంపెనీలు విదేశాల్లో అనుబంధ సంస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. ప్రత్యామ్నాయంగా చైనా, కెనడా వంటి దేశాల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడుతుందని మరో అధ్యయనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ పాలనా యంత్రాంగంలో 'మాగా' గ్రూపు ఆలోచనలను మార్చడానికి భారత ప్రభుత్వం గట్టిగానే పని చేయవలసి వస్తుంది. భారత్‌కు ఆదాయం తెచ్చిపెట్టే దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది. గత ఏడాది 120 బిలియన్ డాలర్ల వరకు భారత్‌కు అమెరికా నుంచి ఆదాయం సమకూరింది. ఈ ఆదాయ స్రవంతిని భారత్ దొరకబుచ్చుకోగలగాలి. అలాగే అమెరికాను ఆకర్షించడానికి సాంకేతిక నైపుణ్యంలో టాప్‌లో భారతీయులు ఉన్నప్పుడే ఎలాంటి చిక్కులు వీసాల్లో ఎదురుకావు.

# ప్రజావాణి దరఖాస్తులపై అలసత్వం తగదు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అలసత్వం తగదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వివిధ సమస్యలతో వచ్చే ప్రజల నుంచి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా (57) ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారం దిశగా అత్యంత ప్రాధాన్యతతో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా అర్జీలు పెండింగ్ లో లేకుండా త్వరితగతిన పరిష్కరించి, పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికై అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించి, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.



ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అలాగే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. సముద్రాల గ్రామం, ఘనపూర్ (స్టేషన్) మండలానికి చెందిన బుంగ అయిలమ్మ, రెవెన్యూ శాఖకు సంబంధించి, తన 5.23 గుంటల భూమిలో 3.18 గుంటల భూమి రికార్డులలో లేదు, కావున రికార్డును పరిశీలించి, ఆ భూమిని పట్టా చేయుట కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. వెంకిర్యాల గ్రామం, జనగామ మండలానికి చెందిన వాకిటి ఉమ, తన వ్యవసాయ భూమిలో విద్యుత్ కొరకు ట్రాన్స్‌ఫార్మర్, పోల్స్ బిగించగా, దానికి విద్యుత్ కనెక్షన్ ఇప్పించుట కొరకు దరఖాస్తు చేసియున్నారు. చీటకోడూరు గ్రామం, జనగామ మండలానికి చెందిన కొత్త మోహన్ రెడ్డి, తన 0–12 గుంటల భూమిని దాసరి మల్లయ్య ఆక్రమించి, బోరు వేసి, పశువుల కొట్టాన్ని వేయగా, ఈ విషయమై తగిన చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయగలరని అర్జీ ద్వారా కోరారు. వావిలాల గ్రామం, పాలకుర్తి మండలానికి చెందిన గుమ్మడి రాజు, 1998 సంవత్సరంలో కొనుగోలు చేసిన తన భూమి దొంగరి శ్రీలత పేరు మీద ఆన్లైన్ లో చూపిస్తోందని, దానిని తొలగించి ఆ భూమిని తన పేరు మీద పట్టా చేయుట కోసం వినతిపత్రం సమర్పించనైనది. తాటికొండ గ్రామం, ఘనపూర్ (స్టేషన్) మండలానికి చెందిన భూక్య మల్లేశం, తన 1–30 గుంటల భూమి కబ్జాకాస్తులో ఉన్నందున, ఆ భూమిని పహాణీలలో చేర్చి, కొత్త పట్టా పాసు పుస్తకం ఇప్పించుటకు దరఖాస్తును సమర్పించినారు. ఈ ప్రజావాణిలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, డిప్యూటీ జెడ్పీ సిఈఓ సరిత, డిడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డిఎఓ రామారావు నాయక్, సీపీఓ పాపయ్య, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ వసంత, డీపీఓ స్వరూప, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఆర్టీసీని అభివృద్ధిలో తెచ్చాం

### – రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
### – జిల్లాలో ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించిన మంత్రులు పొన్నం, పొంగులేటి, కొండా



హనుమకొండ జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండ హయాగ్రీవా చారి మైదానంలో వరంగల్ రీజియన్ కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 50 ఎలక్ట్రికల్ బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తదితరులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీని దండగగా మార్చే ప్రయత్నం చేసిందని, కానీ తమ ప్రభుత్వం ఆర్టీసీని పండగ వాతావరణంలోకి తీసుకువచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కారుణ్య నియామకాలను చేపట్టిందన్నారు. కొత్తగా 3000 మందిని నియామకాల ద్వారా ఆర్టీసీలో ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 1000 బస్సులను కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. పర్యావరణహిత మైన ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసిందన్నారు. తొలి దశలో ఎలక్ట్రిక్ బస్సులను జిల్లా కేంద్రాల నుండి హైదరాబాద్ కు నడిపిస్తుందన్నారు. హనుమకొండ జిల్లాకు 112 ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కేటాయించిందని, మొదటి విడతలో 50 బస్సులను వరంగల్ రీజియన్కు కేటాయించిందన్నారు. సంక్రాంతి పండుగకు మరో 30 బస్సులను ప్రభుత్వం కేటాయించనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 127 కోట్ల మంది మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించినట్లు చెప్పారు. దీనివల్ల 4,500 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందన్నారు. జిల్లాలో ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ నిమిత్తం చార్జింగ్ స్టేషనులకు 10 కోట్ల రూపాయలను ఖర్చు చేయనుందని తెలిపారు. ఆర్టీసీని గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేయగా ఇందిరమ్మ ప్రభుత్వం ప్రగతి పథంలోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తుందన్నారు. భవిష్యత్తులో ఆర్టీసీకి మరిన్ని మంచి రోజులు రానున్నాయి అన్నారు. రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని గత ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నించిందని పేర్కొన్నారు. తప్పని పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వం యూటర్న్ తీసుకుందన్నారు. సంక్రాంతి నాటికి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇచ్చిన వాగ్దానాలతో పాటు ప్రజల సంక్షేమం అభివృద్ధి దృష్ట్యా అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. హాస్టల్స్ విద్యార్థులకు 40శాతం మెస్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆర్టీసీని దండగ అని గత ప్రభుత్వం అంటే, తమ ప్రభుత్వం పండగగా మార్చిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సన్న వడ్లకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ను అందిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం నాలుగు లక్షల ఇళ్లను కట్టిస్తామన్నారు. మొత్తం 20లక్షల ఇళ్లను తమ ప్రభుత్వం కట్టించేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం కట్టకుండా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ధరణిని ప్రక్షాళన చేసి రెవెన్యూలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దాన ప్రకారం రైతు భరోసా ఇస్తామని , పేదోడి అవసరాలను గుర్తించి వారి అవసరాలను నెరవేరుస్తామన్నారు. సాగు చేసే వ్యవసాయ






భూమికి రైతు భరోసాను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యాన్ని కోట్లాదిమంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వైద్య సేవల నిమిత్తం హైదరాబాద్ మహానగరానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా వెళ్లి వస్తున్నారని అన్నారు. పుణ్యక్షేత్రాలను కూడా మహిళలు ఉచితంగా దర్శించుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉండడంతో గతంలో కంటే దేవాలయాల ఆదాయం మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలోని కోట్లాది మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడుతుండగా ప్రభుత్వమే ఆ ఖర్చును భరిస్తుందన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఆర్టీసీ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వరంగల్ నగరానికి మంచి రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నగరాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 125 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని అన్నారు. ఈ పథకం ద్వారా మహిళల్లో సామాజిక అభ్యున్నతి కలిగిందన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం నుండి 112 ఎలక్ట్రికల్ బస్సులు నడవనున్నాయని పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నుండి ఎలక్ట్రికల్ బస్సులను నడపాలని సూచించారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన అనంతరం బస్సులో హనుమకొండ అశోక కూడలి సమీపంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావిణ్య, డాక్టర్ సత్య శారద, ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రామప్ప పర్యటక అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### – పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ స్మితా సబర్వాల్

ములుగు జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): రామప్ప పర్యటక ప్రాంత అభివృద్ధి ప్రసాద్, సాస్కి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ స్మితా సబర్వాల్ అన్నారు. రామప్ప పర్యటక ప్రాంత అభివృద్ధి ప్రసాద్, సాస్కి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలనీ పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ స్మితా సబర్వాల్ అన్నారు. సోమవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా వెంకటపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప దేవాలయాన్ని పర్యాటక సాంస్కృతిక యువజనుల ఆర్కియాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ చేరుకోగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పూల మొక్కను అందచేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయం పరిధిలో జరగుతున్న ప్రసాద్, సాస్కి ప్రాజెక్టుల పనుల గురించి కలెక్టర్ వివరించారు. రామప్ప దేవాలయానికి విచ్చేసిన పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ స్మితా సబర్వాల్ కు దేవాలయ వేద పండితులు సంప్రదాయాల వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ రుద్రేశ్వరుడినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆలయ మండపంలో ను పట్టు వస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ప్రసాద్ స్కీం ద్వారా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పార్కింగ్ మరియు ఇంటర్ప్రిటేషన్ సెంటర్ పనులను పర్యవేక్షించి, రామప్ప హరిత కాటేజ్ లను సందర్శించారు. ఈ సందర్భంగా పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ స్మితా సబర్వాల్ మాట్లాడుతూ యునెస్కో వరల్డ్ హెరిటేజ్ రామప్ప టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ లో భాగంగా గత సంవత్సరం 60 కోట్లు ప్రసాద్ స్కీమ్ లో మంజూరైన పనులు, ఈ సంవత్సరం సాస్కి స్కీం ద్వారా 73 కోట్ల నిధులు మంజూరైన సందర్భంలో రామప్ప పరిసర ప్రాంతాల్లో పర్యాటకులకు ఏ విధమైన ఫెసిలిటీస్ ఉంటే ఎక్కువ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు ఉండాలని సలహాలు సూచనలు చేశారు. కాంట్రాక్టర్స్ పిలిచి బాగా చేస్తున్నారనీ, టైం లో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. రామప్ప టెంపుల్ లో సౌండ్ అండ్ లైట్ షో గురించి ఆర్కే లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో చర్చించి ఏ విధంగా లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటు చేయాలో, ఏప్పటివరకు చేస్తారనే విషయాలను చర్చించారు.



అదేవిధంగా టెంపుల్ లోని కళ్యాణ మండపం పనులను పరిశీలించారు. తొందరగా కళ్యాణ మండపం పనులు పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులో ఉండే విధంగా ఉండాలని కోరారు. వచ్చిన పర్యాటకు లకు ఇక్కడ ఒక ఖాళీ ప్లేస్ ఉన్నదని భావం రాకుండా తొందరగా ఆ కళ్యాణ మండపాన్ని పునరుద్ధరించాలని ఏఎస్ఐ అధికారులను సూచించారు. టెంపుల్ పరిసరాలలో ల్యాండ్ గురించి టూరిజం కి ఏ విధమైన లాండ్స్ ఇచ్చారు. ఎన్ని ఎకరాలు ఇచ్చారు. ఏ విధమైన డెవలప్మెంట్ చేయబోతున్నారు అనే వాటి గురించి కలెక్టర్ తో చర్చించారు. ఈ సందర్భంగా రామప్ప టెంపుల్ కి వచ్చిన పర్యాటకు లతో స్మితా సబర్వాల్ పర్యాటకులను అడిగి మీరు దేనికి వచ్చారు వచ్చి ఏం నేర్చుకున్నారు ఇక్కడ ఎంతసేపు ఉంటున్నారు ఇక్కడ నుంచి ఏక్కడికి వెళ్తారు. ఇక్కడ ఇంకా ఏమైన వసతులు అవసరం ఉన్నాయా అని పర్యాటకులను అడిగి తెలుసుకున్నారు. తద్వారా పర్యాట కుల ఆలోచన మేరకు ఏ విధంగా ఇక్కడ పర్యాటకులకు ఏర్పాట్లు, సౌకర్యాలు చేయాలో టూరిజం ఎండి, కలెక్టర్ సూచనలు చేశారు. అక్కడి నుండి రామప్ప టెంపుల్ కి వెళ్లే దారిలో తూర్పు ద్వారానికి వెళుతున్న క్రమంలో ఉన్న రోడ్డుని వెడల్పు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. రామప్ప విశిష్టతను హెరిటేజ్ని ప్రతిబిం బించే విధంగా ఎంట్రెన్స్ గేటు మరియు సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని టూరిజం ఎండి కి సూచించారు. ఈ కార్యక్రమం లో పర్యాటక అభివృద్ధి సంస్థ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం హెరిటేజ్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ లక్ష్మీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఇంజనీర్స్ జనరల్ మేనేజర్ మరియు ప్రాజెక్టు కన్సల్టెంట్స్ సత్యనారాయణమూర్తి క్షేత్ర కన్సల్టెన్సీ, కేంద్ర పురావస్తు శాఖ అధికారులు డాక్టర్ హెచ్ ఆర్ దేశాయ్, డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్, డాక్టర్ రోహిణి పాండే, అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్, ఎం నవీన్ కుమార్ వరంగల్ సబ్ సర్కిల్ ఇంచార్జి, డైరెక్టర్ హెరిటేజ్ తెలంగాణ, రాములు నాయక్, డిప్యూటీ డైరెక్టర్ మల్లు నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ వరంగల్ నర్సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ (ఇంజనీరింగ్), ఆర్డీఓ వెంకటేష్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఇంజనీర్స్ డి ఈ ధనరాజ్, పర్యాటక శాఖ తరపున డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్, రెవిన్యూ, పంచాయితి రాజ్, ఇర్రిగేషన్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి దరఖాస్తులను ఆలస్యం చేయకుండా సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి . హెచ్. మహేందర్ జి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దన్నారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో రావాలని పేర్కొన్నారు. ప్రజావాణి లో మొత్తం 49 వినతులు వచ్చాయి. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్



ఈడీ తుల రవి, సిపిఓ ప్రకాష్, డిసిఎస్ఓ షా ఫైజల్ హుసేని, డి ఎం డి సి ఎస్ ఓ రాంపతి, డి సి ఓ సర్దార్ సింగ్, ఎల్డి ఎం జయ ప్రకాష్, డి డబ్ల్యూ ఓ శిరీష, ఎలక్ట్రిసిటీ డి ఈ నాగేశ్వరరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్బంధాలు నశించాలి.. రైతులకు భరోసా కల్పించాలి

**– భారత రాష్ట్ర జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్యం విజయ్ భాస్కర్**






హనుమకొండ, జనవరి 06 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు భరోసా కల్పించాలని భారత రాష్ట్ర జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్యం విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల అరెస్ట్ నేపథ్యంలో అక్కడికి చేరుకున్న ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేశారు. పార్టీ ఆఫీసులోనే నిర్బంధించారు. పోలీసులకు, విజయ్ భాస్కర్ కి వాగ్వాదం చేటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన రైతు డిక్లరేషన్ అమలు చేయమని ప్రశ్నిస్తే అక్రమ అరెస్ట్లు ఏంటని అన్నారు. ప్రజా పాలన అని కాంగ్రెస్ నియంతృత్వ పాలనను కొనసాగిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాడుతామని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణుల అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. నిర్బంధాలతో ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తప్పించుకోలేరని అన్నారు. ఆయన వెంట మధు, నవీన్, కిషోర్, ఉదిత్, జేకే, స్నేహిత్, రాజు, సోను, చంద్రమౌళి గౌడ్, చిన్నా, వేణు, రవి తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**– జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత శాఖల వారికి పంపి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సోమవారం వివిధ సమస్యలపై ఈ క్రింది విధంగా కొంతమంది దరఖాస్తు చేసుకున్నారు. గూడూరు మండలం, చిన్నఎల్లపురం గ్రామంకు చెందిన కొల్లూరి, మల్లయ్య, తుమ్మల మకయ్య,లు గతంలో ప్రభుత్వం నుండి మంజూరు అయి ఇల్లు నిర్మించుకున్నాను అందుకు సంబంధించిన బిల్లు మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. తొర్రూరు మండలం, వెంకటాపురం గ్రామంకు చెందిన మందుల సుగుణమ్మ, తనకు ఇందిరమ్మ ఇల్లు, ఉచిత గ్యాస్ కలెక్షన్ మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. మహబూబా



బాద్ మండలం,కంబాలపల్లి గ్రామానికి చెందిన నీలం కృష్ణవేణి, దాసరి సోమలక్ష్మి, ఎర్రమ్మ, కమటం పద్మ, తదితరులు తమకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని దరకస్తులు తీసుకోవాలి కోరారు, ఇలా మొత్తం (99) ధరకాస్తు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ పిడి మధుసూదన రాజు, జడ్పీ సీఈఓ పురుషోత్తం, బీసి వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహ స్వామి, సిపివో సుబ్బారావు, డీహెచ్ఓ మరియన్న, గ్రాండ్ వాటర్ అధికారి వేముల సురేష్, డిఎఓ విజయ నిర్మల, అన్నీ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలణ అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కు జిల్లా విద్యార్థులు

మహబూబాబాద్ జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): మహబూబ్ నగర్ జిల్లాలోని జడ్చర్ల పోలేపల్లి సెజ్ లో ఆరో తారీకు నుంచి తొమ్మిదవ తారీకు వరకు జరగబోయే రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో పాల్గొనుటకు జిల్లాస్థాయిలో విజేతలైన 8 ఇన్స్పైర్ ప్రాజెక్ట్ సంబంధించిన విద్యార్థులు మరియు రాష్ట్ర బాల వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలైన 13 ఎగ్జిబిట్ లకు సంబంధించిన విద్యార్థులు మరియు గైడ్ ఉపాధ్యాయులు మొత్తం 37 మంది రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో పాల్గొనుటకు సోమవారం ఉదయం కలెక్టరేట్ ప్రాంగణం నుండి బయలుదేరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మీ మీ ఎగ్జిబిట్ ల ను చక్కగా ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో కూడా విజేతలు కావాలని తెలియజేస్తూ జెండా ఊపి విద్యార్థుల బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ డాక్టర్ ఏ. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలైన మీరందరూ కూడా రాష్ట్రస్థాయిలో కూడా మహబూబాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో




డి.పి.ఆర్.ఓ రాజేంద్రప్రసాద్, జిల్లా సైన్స్ ఆఫీసర్ బి.అప్పారావు, హెడ్మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరాం, ప్రధానోపాధ్యాయులు సంక బద్రి నారాయణ, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చైనా మాంజా అమ్మకాలు నిషేధం

**– ఎస్ ఐ. ఏ కమలాకర్ పసర పోలీస్ స్టేషన్**

గోవిందరావుపేట : చైనా మాంజా అమ్మకాలు నిషేధం అని పసర పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఏ కమలాకర్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్ ని పతంగుల విక్రయదారులకు ఎస్ ఐ కమలాకర్ తగు సలహాలు సూచనలు చేశారు. మండల పరిధిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, చైనా మాంజా విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. చైనా




మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు చైనా మాంజాతో తలెత్తే అనర్థాలపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని అన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అనుసరించి చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని అన్నారు. ఈ చైనా మాంజాను రవాణా చేసిన, అమ్మిన సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషనులకు గాని, డయల్ 100 గాని ఫోన్ చేసి చెప్పాలని తెలిపారు.

# ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): కుట్టు శిక్షణ పొందిన మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నందున అర్హులైన మహిళలు ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తులు అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి.రవీందర్ తెలిపారు. తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టు శిక్షణలో నైపుణ్యాన్ని అప్గ్రేడ్ చేయాలనే ఉద్దేశంతో ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తుందన్నారు. అర్హులైన మహిళలు తమ దరఖాస్తులను TGOBMM వెబ్ పోర్టల్ ద్వారా tgobmms.cgg.gov.in ద్వారా ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు ఆన్లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జనగామ లో అందజేయాలన్నారు. మైనారిటీ కమ్యూనిటీకి చెందిన మహిళలు, విడాకులు, వితంతువులు, అనాథలు ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు కంటే తక్కువ, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల వరకు ఉండాలన్నారు. దరఖాస్తుదారుని వయోపరిమితి 18 సంవత్సరముల నుండి 55 సంవత్సరంల మధ్య ఉండాలన్నారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా జత చేయాలన్నారు. ఒక కుటుంబానికి ఒక కుట్టు మిషన్ ఇవ్వబడుతుందన్నారు. అభ్యర్థి తప్పనిసరిగా టైలరింగ్ కోర్సులో శిక్షణ పొంది ఉండాలని, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంద న్నారు. కుట్టు శిక్షణ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని, కనీస విద్యార్హత 5వ తరగతి గా పేర్కొన్నారు. దరఖాస్తు దారు గత ఐదు సంవత్సరములలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఎటువంటి ఆర్థిక సహాయం పొందలేదని స్వీయ ప్రకటన ఇవ్వాలన్నారు. ఇతర వివరములకు కార్యాలయం సమయంలో సంప్రదించాలన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రజలందరికి చేరాలి

**– స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పార్టీ విజయం సాధించాలి**

**– మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి**

మంగపేట, జనవరి 06 (తీన్మార్ న్యూస్): సోమవారం రోజునా మంగపేట మండల రాజుపేట గ్రామం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల ముఖర్జీ ఇంటి వద్ద గ్రామ అధ్యక్షులు పొట్రూ సమ్మయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమిక్ష సమావేశంలో భాగంగా మంత్రివర్యులు సీతక్క ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు పైడకుల అశోక్ సూచనల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు అఖినేపల్లి మల్లారం నుండి చుంచుపల్లి గ్రామంలోని ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం కాంగ్రెస్ పార్టీని మరింతా ముందుకు తీసుకెళ్లి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలనీ అదేశం అందుకు కానీ మండల టీసీ పరిధి లోని క్లస్టర్ల వారిగా ఒక్కో క్లస్టర్ కు ఆరు నుండి ఎనిమిది మంది వరకు ఇంచార్జి లను నియమించిన మంగపేట మండల కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కోసం ముందుకు తీసుకువెళ్లాలి అందుకోసం ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ సైనికుల్లా పని చేయాలనీ సూచించారు అదే విధంగా ప్రజా ప్రభుత్వం చేస్తున్నటువంటి ప్రజా పాలన అభివృద్ధి పనులను ప్రజల సంక్షేమ పథకాలను పల్లెల్లోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలి అదేవిధంగా ములుగులో గడిచిన సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారం



వచ్చాక మల్లంపల్లి నూతన మండలంగా ఏర్పాటుచేసి ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ గా చేసి ములుగు మండలాన్ని మున్సిపాలిటీగా చేసి ములుగు బస్సు డిపో ఏర్పాటు చేసి ములుగు అభివృద్ధి బాటలో ముందుగా ఉంది రాబోయే రోజుల్లో మరెన్నో అద్భుతాలు జరుగుతాయి కాంగ్రెస్ పార్టీ మరింత ముందుకు తీసుకోవడం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని అదే విధంగా రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రతి ఒక్కరు నడుం బిగించి ఒక్క స్థానం కూడా ఇతర పార్టీలకు ఇవ్వకుండా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా ముందుకు వెళ్లాలని సూచించి కాంగ్రెస్ పార్టీ ముందు ముందు మరింత బలోపేతం కోసం నాలుగు టీసీ పరిధిలో టీసీల ప్రకారం క్లస్టర్లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు,జిల్లా కాంగ్రెస్ నాయకులు, అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు, మరియు నాయకులు, యూత్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మండల సీనియర్ నాయకులు సీతక్క కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతతో పేదరిక నిర్మూలన

## జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే. జయరాం రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): సంక్షేమ పథకాల పట్ల అవగాహన కలిగి వున్నప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందని అలాగే ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక క్రమశిక్షణ కూడా పేదరికాన్ని పోగొడుతుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ మరియు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఏ) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పేదరిక నిర్మూలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శుభాష్ కాలనీలోని మండల సమాఖ్య సమావేశ మందిరంలో జరిగిన సమావేశానికి జడ్జి అతిథిగా హాజరయ్యారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఏ) ఆధ్వర్యంలో వివిధ రకాల అభివృద్ధి పథకాలు అమలు చేయబడుతున్నాయని, మహిళల ఆర్థిక స్వేచ్ఛ కోసం కూడా పథకాలు ఉన్నాయని జడ్జి అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఎదిగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్




కౌన్సెల్ శ్రీమతి జి. ప్రియాంక గారు, డి ఆర్ డి ఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గోవిందరావు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు నారాయణ, సోమయ్య, ఎపిఎం రతన్ సింగ్, సి సి లు విజయలక్ష్మి, సంతోష్, అమరేందర్, మండల్ సమాఖ్య మరియు గ్రామా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చిన సమస్యలు పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 36 వినతులు స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధత అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన 36 దరఖాస్తులను పరిష్కరానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల



పరిష్కారం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించి, అట్టి సమాచారం ప్రజావాణి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ మంగిలాల్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని హైస్కూల్లో రోడ్ సేఫ్టీ కార్యక్రమం

జనగామ జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని సెంట్ మేరీయా హైస్కూల్లో రోడ్ సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ పిల్లలకు, డ్రైవర్లకు స్కూల్ బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు, స్కూల్ బస్సులో ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. అలాగే కొంతమంది పేరెంట్స్ పిల్లల్ని స్కూల్ దగ్గర డ్రాప్ చేయడానికి టూవీలర్స్ పైన రావడం జరుగుతుంది. అందుచేత పిల్లలతోనే కంపల్సరీ పేరెంట్స్ హెల్మెట్ పెట్టుకోవాలని గుర్తు చేయాల్సిందిగా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్టీవో జీవి శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది, కానిస్టేబుల్ వెంకటేష్, తదితరులు



పాల్గొన్నారు.

# కోటగుళ్ళు ప్రాథమిక మరమ్మతులు ప్రారంభించాలి

## పర్యాటక, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): కోటగుళ్ళ ప్రాథమిక మరమ్మతు పనులు తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తెలిపారు. సోమవారం కోటగుళ్ళు, గణపురం రిజర్వాయర్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, పర్యాటక శాఖ ఎండి ప్రకాష్ రెడ్డితో కలిసి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటగుళ్ల కోటగుళ్ల ప్రాంతంలో పర్యాటకుల సందర్శనకు లుగా సదుపాయాల కల్పన పరిస్థితులను పరిశీలించారు. కోటగుళ్ళు ప్రాంతంలో పర్యాటకుల ఆకర్షణలను మెరుగుపరిచే దిశగా ప్రాథమిక మరమ్మతు పనులు, తదనంతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల ప్రణాళికను నవీకరించి, అవసరమైన టెండర్ ప్రక్రియను ఈ నెలాఖరుకి పూర్తి చేయాలని, ఆలస్యం లేకుండా పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని తద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ పనులను నిరంతరాయంగా చేపట్టి వచ్చే మార్చి నెలాఖరుకి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం గణపురం రిజర్వాయర్ ను పరిశీలించారు. పర్యాటకులకు విడిది, బోటు సౌకర్యాలు కల్పన. పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకు



న్నారు. పర్యాటకులకు సౌకర్యాలను అందించేందుకు కాటేజీలు, బోటు షికారు మరియు ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రహదారి పనులను వేగవం తంగా పూర్తిచేయాలని, మిగిలిన టెండర్ ప్రక్రియను ఈ నెలాఖరు వరకు ముగించి వెంటనే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ ప్రాంత అభివృద్ధికి, పర్యాటక అభివృద్ధికి చేపట్టనున్న పనులను మార్చి 2025 నాటికి అన్ని పనులను పూర్తి చేయడం లక్ష్యంగా నిర్దేశించుకోవాలని తెలిపారు. నిరంతరాయంగా పనులు కొనసాగించాలనీ, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలుగా ఈ ప్రాజెక్టులను తీర్చిదిద్దుతామన్నారు.

# దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ విద్యా చందన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు.

**గ్రీవెన్స్ లో కొన్ని ఫిర్యాదులు**

– టేకులపల్లి మండలం బద్రు తండా గ్రామపంచాయతీలో నివాసముంటున్న చింతా లక్ష్మీకాంత భర్త మహేష్ సర్వే నెంబర్ 941/1అ, ఖాతా నెంబర్ 5113 విస్తీర్ణం 8 గుంటలు మరియు మా తల్లి లేటు మూతి చుక్కమ్మ పేరున ఉన్న భూమి విస్తీర్ణం 8 గుంటలు ఇట్టి భూమి మొత్తం విస్తీర్ణం 16 గుంటలు. పట్టాదారు పాస్ పుస్తకం కొరకు పలుమార్లు తాసిల్దార్ కార్యాలయం కి తిరిగినప్పటికీ న్యాయం జరగలేదని తగిన న్యాయం చేయవలసిందిగా చేసిన దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఈ సెక్షన్స్ సూపర్డెంట్ కి ఎండార్స్ చేయడం జరిగింది.

– కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని మధుర బస్తి లో నివాసం ఉంటున్న ఎం ఏ రియాజ్ తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సమస్త ఆపరేషన్ భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ కార్యాలయం మీకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి ఉన్నానని, దరఖాస్తు చేసి నెల రోజులు దాటిన ఇప్పటివరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు అని కావున పెట్టిన సమాచార దరఖాస్తు పూర్తి పారదర్శకంతో సమాచారం ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం సి సెక్షన్ సూపర్ టెంట్ కు ఎండార్స్ చేయడం జరిగింది.

– సుజాతనగర్ మండలం లక్ష్మీపురం తండాలో నివాసం ఉంటున్న బోడ రామ అనే రైతు ఆర్ ఓ ఎఫ్ ఆర్ అటవీ హక్కుల పట్టా పాస్ పుస్తకం కలిగి ఉన్నానని, తనకి ఉన్న ఎకరం 30 గుంటల వ్యవసాయ భూమిలో ఉపాధి హామీ పథకం ద్వారా 20 సంవత్సరాల క్రితం టేకు



చెట్లను వేయడం జరిగిందని, టేకు చెట్లు పెద్దగా పెరగడం వల్ల పంటలు దిగుబడి రావటం లేదని, కావున ఉన్న 30 టేకు చెట్లను నరికి అమ్ముకొనుటకు అనుమతి ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం ఈ సెక్షన్ సూపర్డెంట్ ఎండార్స్ చేయడం జరిగింది.

– ఇల్లందు మండలం మామిడి గుండాల గ్రామం లో నివాసం ఉంటున్న రామ్మోహన్రావు మామిడి గుండాల గ్రామంలో సర్వే నంబర్లు 130/2దగ్గర 5/1,105/3, 80,81,130/2 D/5/3 లో గల మా వారసత్వ భూమిలో కొంతమంది అక్రమంగా బోర్లు వేయుచున్నారని, కావున బోర్లు వేయకుండా నిలుపుదల చేయించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం తాసిల్దార్ కు ఎండార్స్ చేయడం జరిగింది.

– సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ గుడి వెనుక వీధిలో గత ఎనిమిది నెలల నుండి త్రాగునీరు రావడం లేదని మరియు మా బోరులలో నుండి మురికి నీరు వస్తుందని కావున మా సమస్యను పరిష్కరించి, త్రాగునీరు ఇప్పించగలరని ఆమస్తులు చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం బూర్గంపాడు ఎంపీడీవో కు ఎండార్స్ చేయడం జరిగింది.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో పరిపాలన అధికారి రమాదేవి మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష





ములుగు జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశానుసారము సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ మీటింగ్ హాల్లో, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకులకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విపిన్ కుమార్ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకుల ఉద్దేశించి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తల విధి నిర్వహణ, నిర్దేశించిన ప్రణాళికలు షెడ్యూల్ ప్రకారం చేసేటట్లు చూసే బాధ్యత పర్యవేక్షకుల దేనినని, ఒకవేళ లోపాలు ఉన్నట్లయితే వాటిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో శిక్షణను ఇచ్చి నైపుణ్యాన్ని పెంపొందిస్తె, నైపుణ్యంతో కూడిన ఆరోగ్య సేవలు ప్రజలకు అందజేస్తారని, పర్యవేక్షకులకు తెలిపారు. అసంక్రమిక వ్యాధులు హైపర్ టెన్షన్, మధుమేహ మీనింగ్ పరీక్షలు మరియు సికిల్ సెల్ స్క్రీనింగ్ ఈ మాసం చివర్లో కంప్లీట్ చేయాలని పర్యవేక్షణకు సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారము నియమ నిబంధనలతో పిల్లలకు వ్యాక్సినేషన్ చేయాలని, చేసిన పనిని పోర్టల్ లో నమోదు చేసేటట్లు ఆరోగ్య కార్యకర్తలను కార్యోన్ముగులను చేయాలని పర్యవేక్షకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్. పవన్ కుమార్, డాక్టర్. రణధీర్, ఇంచార్జ్ డెమో సంపత్, ఏ ఎం ఓ దుర్గారావు, పూర్ణ సంపత్ రావు, డి పి హెచ్ ఎన్ శకుంతల, ఇంచార్జ్ ఎస్ ఓ స్వరూప రాణి, హెల్త్ ఎడ్యుకేటర్ అరుణ,ఎం సి హెచ్ కోఆర్డినేటర్ సురేష్ బాబు, డిడిఎం ప్రవీణ్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# నర్సింగ్ సిబ్బంది సేవలు మరువ లేనివి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 06 (తీన్మార్ న్యూస్): నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, నర్సింగ్ సిబ్బంది సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. ఐ.ఎం.ఎ హాల్ నందు ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ -1, గ్రేడ్-2 మరియు హెడ్ నర్సుల అభినందన సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. ఎంతో ఒత్తిడితో రోగులకు అందుబాటులో ఉంటూ రోగులకు సేవ చేస్తూ, రోగికి వైద్యునికి మధ్య అనుసంధానంగా వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న నర్సింగ్ సిబ్బంది సేవలను ఆయన కొనియాడారు. ఎన్ని వత్తిళ్లు ఉన్నా కూడా రోగికి వైద్యం అందించడమే లక్ష్యంగా సేవలు అందిస్తున్న నర్సులను ఆయన ప్రశంసించారు. వృత్తిలో భాగంగా ఎటువంటి సమస్యలు ఉన్న తానున్నానని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో




డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, జిల్లాలోని టివివిపి ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రాధా రుక్మిణి, డాక్టర్ సునీల్ మజ్నేకర్, డాక్టర్ హర్షవర్ధన్, జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా మోహన్ మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సంగ శివ అంతిమయాత్రలో పాల్గొన్న ఎన్హెచ్ఆర్సి నాయకులు

## ఘన నివాళులు అర్పించిన రాష్ట్ర అధ్యక్షులు డా. మొగుళ్ళ భద్రయ్య దంపతులు, మాజీ ఏజీపీ

ములుగు, జనవరి 06 (తీన్మార్ న్యూస్): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) ములుగు జిల్లా మల్లంపల్లి మండల నాయకులు సంగ శివన్న అనారోగ్యంతో మృతి చెందగా అతని పార్థివ దేహాన్ని సోమవారం జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య సార్ దంపతులతో పాటు సంస్థ సలహాదారులు, హైకోర్టు హొం శాఖ మాజీ ఏజీపీ ఎం.గౌతం కుమార్ సందర్శించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆత్మీయున్ని కోల్పోయిన భావోద్వేగ క్షణాల్లో రాష్ట్ర అధ్యక్షులు, కమిటీ నాయకులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. సంస్థ బలోపేతం కోసం సంగ శివన్న చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అతని దేహానికి జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంతిమయాత్ర చివరి వరకు ఉండి తమ ఆత్మీయుని దహన సంస్కరాల్లో పాల్గొన్నారు. అతని భార్య ఇద్దరు కూతుళ్లకు అండగా ఉంటామని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గోగులమూడి హరికృష్ణ, గ్రేటర్ వరంగల్ ఇన్చార్జి కోమండ్ల శ్రీనివాస్, ములుగు జిల్లా అధ్యక్షులు పెట్టెం రాజు, ప్రధాన కార్యదర్శి సన్నగుండ్ల వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగం రమేష్, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు గాదె




శ్రీనివాసచారి, ప్రచార కార్యదర్శి కూరాకుల బాలకృష్ణ, మిరియాల ప్రవీణ్, కొడారి గణేష్ యాదవ్, మల్లంపల్లి మండల అధ్యక్షులు గట్ల రవి, ములుగు మండల అధ్యక్షులు వీరమల్ల రామస్వామి, వెంకటాపూర్ మండల అధ్యక్షులు ఎనబోతుల రాజు, ప్రధాన కార్యదర్శి లతా ప్రేమ్ సాగర్, గోవిందరావుపేట మండలం అధికార ప్రతినిధి కొండి రమేష్ హాజరై సంగ శివన్నకు జోహార్లు అర్పించారు.

# మెగా జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి

## ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

గోవిందరావు పేట, జనవరి 06 (తీన్మార్ న్యూస్): జిల్లా గ్రామీణాభివృద్ధి – ఈజీ ఎం ఎం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా నేపథ్యంలో సోమవారం పీఎస్ఆర్ గార్డెన్స్ చల్వాయిలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పర్శిలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన 50 ప్రత్యేకమైన డైరెక్ట్ ప్లేస్మెంట్ ఇచ్చే కంపెనీలకు, ప్రత్యేకమైన స్టాల్స్ ను ఏర్పాటు చేసి, మరియు 30 శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించే స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలుపుతూ జాబ్ మేళాకు వచ్చే యువతకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తూ, వచ్చిన యువతకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. నేడు నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ



యువతీ యువకులు హాజరై వివిధ కంపెనీ లలో ఉద్యోగం పొందే విధంగా, మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఏ సంపత్ రావు, డిపిఎం ఏ సతీష్ , ఏ పీఎం డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆగని సమ్మె.. సాగని చదువులు..

## – మానవ హక్కులను హరిస్తున్న ప్రభుత్వం

కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 27 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ కేజీబీవీ, ప్రత్యేక అవసరాలు గత 30 రోజుల తాము సమ్మె చేస్తున్నందున అప్పట్నుండి విద్యార్థులకు విద్యా బోధన అందడం లేదని, ఇది మానవ హక్కులను ఉల్లంఘించడం అవుతుందన్నారు. దానికి ప్రభుత్వమే జవాబు చెప్పవలసిన అవసరం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఇచ్చిన హామీని అమలు చేయాలని వెంటనే తమను రెగ్యులర్ చేయాలని అప్పటివరకు పే స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగత కల్పించాలని డిమాండ్ చేశారు. తామంతా మెరిట్ కం రోస్టర్, ఇంటర్వ్యూ, రాత పరీక్ష ద్వారా నియామకమై 18 సంవత్సరాల నుంచి విద్యాశాఖలలో పనిచేస్తున్నా కనీస వేతనాలు లేవని, తాము శ్రమ దోపిడి గురి అవుతున్నామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం ఉల్లంఘిస్తుంది అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ టీచర్లు తమకు కావాలని చెప్తున్న ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పురుష ఉపాధ్యాలను పంపించడం ఇది చట్ట విరుద్ధమని ప్రభుత్వం ఆలోచన చేయాలని అన్నారు. ఇప్పటివరకు మా స్వశక్తితో ఉద్యమం



నడుస్తున్న ప్రతిపక్షాలు నడిపిస్తున్నారంటూ రాజకీయ కుట్ర జరుగుతుందన్నారు. చెప్పి తప్పించుకోవడం ముఖ్యమంత్రి హోదాకు తగదన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమముగా మార్చి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు, సంతోష్ రెడ్డి, రాములు, వనజ,రమేష్, శ్రీవాణి,శైలజా,కాళిదాసు, వీణ,చిరంజీవి, కృష్ణ, శ్రీనివాస్,మాధవి,సంధ్యా,దినేష్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మఇళ్ల సర్వేకు టెక్నికల్ ఎఫెక్ట్...

కరీంనగర్: ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం, నిలువ నీడలేని నిరుపేదలకు స్వంత ఇంటి కలను నిజం చేస్తాం'... ఇది కాంగ్రెస్ ప్రభుత్వ హామీ. ఈ హామీని నిలబెట్టుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపిక కోసం ముమ్మరంగా సర్వే చేపట్టింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా లబ్దిదారుల ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్ వర్క్ ప్రాబ్లం ఉండగా పట్టణ ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న వారు అందుబాటులో లేకపోవడం అడ్రస్ సరిగా ఉండకపోవడంతో సర్వేకు ఆటంకంగా మారింది. డిసెంబర్ నెలాఖరులోగా సర్వే పూర్తి పూర్తిచేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకోగా సాంకేతిక సమస్యలతో జనవరి 3 వరకు 75% మాత్రమే సర్వే పూర్తయింది. గ్రామీణ ప్రాంతాల్లో కాస్త పర్వాలేదనుకున్నా పట్టణ ప్రాంతాల్లో మాత్రం 70 శాతం కూడా పూర్తి కాలేదు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సర్వే అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఉప్పట్ల లో నెట్ వర్క్ ప్రాబ్లాన్ని అధికమించేలా గ్రామ కార్యదర్శి హరికృష్ణ పొడవాటి కర్రకు సెల్ ఫోన్ కట్టి హాట్ స్పాట్ ఆన్ చేసి ట్యాబ్ కు కనెక్ట్ చేసుకుని యాప్ లో సర్వే డేటా పొందుపర్చి ఇప్పటి వరకు 90 శాతం సర్వే పూర్తి చేశారు. నెట్వర్క్ ప్రాబ్లం, సాంకేతిక సమస్యలతో రోజుకు 10 నుంచి 15 ఇళ్ల కంటే ఎక్కువ సర్వే చేయలేకపోతున్నామని పలు గ్రామల కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ళ కోసం ప్రభుత్వానికి ప్రజాపాలన కార్యక్రమంలో 8054554 దరఖాస్తులు రాగ, ఇప్పటివరకు 5990889 సర్వే నిర్వహించారు. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 94 శాతం సర్వే పూర్తయింది. జీహెచ్ఎంసీ పరిధిలో అతి తక్కువగా 16 శాతం దరఖాస్తులపైనే సర్వే జరిగింది. కరీంనగర్ నగరం పాలక సంస్థలో 56 శాతం సర్వే పూర్తయింది. హైదరాబాద్ మినహాయించి మిగతా 32 జిల్లాల్లో వారం పదిరోజుల్లో 100 శాతం సర్వే పూర్తయ్యే అవకాశాలున్నాయి. సర్వేను వేగవంతం చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కరీంనగర్ జిల్లాలో 82 శాతం పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,10,677 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు గ్రామాల్లో 88 శాతం, మున్సిపాలిటీలైన జమ్మికుంటలో 96.94 శాతం, హుజురాబాద్ లో 90.75 శాతం, చొప్పదండిలో 84.01 శాతం, కొత్తపల్లిలో 72.15 శాతం, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 56 శాతం సర్వే పూర్తయినట్లు కలెక్టర్ పమెలా సత్పతి ప్రకటించారు. త్వరగా పూర్తిచేసేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పొరపాట్లు జరగకుండా పక్కాగా వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రోజు వారీగా పూర్తయిన సర్వే వివరాలను అందించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. సంక్రాంతి తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్దిదారుల జాబితా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో ఇందిరమ్మ కమిటీలు ప్రధాన పాత్ర పోషించనున్నాయి. అనంతరం గ్రామాల వారీగా లబ్దిదారుల ఎంపిక జాబితాలను జిల్లా కలెక్టర్లకు పంపిస్తారు. కలెక్టర్లు పరిశీలించాక ఇన్చార్జి మంత్రులకు పంపిస్తారు. ఇన్చార్జి మంత్రి ఆమోదం తెలిపితే లబ్ధిదారుల ఖాతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే నగదును విడతల వారీగా జమచేస్తారు.

# ఆగని హైడ్రా కూల్చివేతలు

**- అయ్యప్ప సొసైటీలో ఐదు అంతస్తుల భవనం నేలమట్టం**
**- షోకాజ్ నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడాన్ని**
**- తీవ్రంగా పరిగణించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**




మియాపూర్: రంగారెడ్డి జిల్లా మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. అక్రమంగా రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ఐదు అంతస్తుల భవనాన్ని ఆదివారం కూల్చివేసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వేనెంబర్ 11/15 అయ్యప్ప సొసైటీలో 684 గజాల్లో అక్రమంగా నిర్మించిన భవనానికి గతంలో జీహెచ్ఎంసీ నోటీసులు ఇచ్చింది. అలాగే నిర్మాణం ఆపాలని, భవనం కూల్చివేయాలని హైకోర్టు కూడా స్టే ఇచ్చింది. అయితే ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా.. సెల్లార్, గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు 5 అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఇది అక్రమ నిర్మాణం కావడం, దీనికి తోడు 100 ఫీట్ రోడ్డు ఒకవైపు అండర్ పాస్ బ్రిడ్జి సైతం బిల్డింగ్‌కి సమీపంలో ఉండటం, స్థలంపై అనేక కేసులు ఉండటం, ఎలాంటి నిబంధనలు పాటించపోవడంపై జీహెచ్ఎంసీ అధికారులు పలుమార్లు బిల్డర్లకు నోటీసులు జారీచేశారు. అయినా వారు వాటిని పట్టించుకోకుండా నిర్మాణాన్ని చేపట్టడంతో దీనిపై ఇటీవల స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు హైడ్రా, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం భవనాన్ని పరిశీలించారు. అక్రమ కట్టడమని హైకోర్టు నిర్ధారించాక కూడా కోర్టు ఉత్తర్వులు, జీహెచ్ఎంసీ నోటీసులు పట్టించుకోకుండా భవనాన్ని నిర్మించడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. శనివారమే సదరు భవనం కూల్చివేత పనులు చేపట్టాల్సి ఉన్నా ట్రాఫిక్ సమస్యల కారణంగా ఆదివారం ఉదయానికి వాయిదా వేశారు. ఆదివారం జేసీబీల సాయంతో భవనాన్ని పూర్తిగా కూల్చివేశారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ప్రధాన రహదారికి ఆనుకొని ఐదంతస్తుల నిర్మాణం చేపడుతున్నప్పటికీ జీహెచ్ఎంసీ, ఇతర శాఖల ఉన్నత అధికారులు బిల్డింగ్‌ని చూసి చూడకుండా వదిలేయడం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్లనే భవన నిర్మాణం జరిగిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యకు ప్రాధాన్యత పెరిగేనా?

**- 15 శాతం నిధులు కేటాయిస్తామన్న కాంగ్రెస్**
**- 7.31 శాతం నిధులతోనే సరిపెట్టిన ప్రభుత్వం**
**- వచ్చే బడ్జెట్‌లోనైనా హామీ నెరవేరుతుందా..?**
**- తక్కువ సమయంలో డీఎస్సీ ద్వారా టీచర్ల భర్తీ**
**- ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్**
**- సమీకృత గురుకులాలకు సర్కారు శ్రీకారం**



హైదరాబాద్: విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నది. విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ ఆచరణలో మాత్రం 2024-25లో బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,292 (7.31 శాతం) కోట్లు మాత్రమే కేటాయించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యకు రూ.21,389 (7.75 శాతం) కోట్లు ప్రతిపాదించింది. అంటే బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం 0.44 శాతం నిధులను తగ్గించడం గమనార్హం. అంకెల్లో చూసినా బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.97 కోట్లు తగ్గించింది. 2023-24 బడ్జెట్‌లో విద్యకు రూ.19,051.25 (6.56 శాతం) కోట్లు కేటాయించింది. అంటే 2023-24 ఆర్థిక సంవత్సరం కంటే 2024-25 బడ్జెట్‌లో రూ.2,241 కోట్లు అదనంగా ప్రతిపాదించింది. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టుగా 15 శాతం నిధులైనా ప్రస్తుతానికి కేటాయించాలి. కానీ అందులో సగం కూడా కేటాయించకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం బడ్జెట్‌లో విద్యకు 15 శాతం అయితే రూ.43,673.85 కోట్లు, 10 శాతం అయితే రూ.29,115.9 కోట్లు కేటాయించాలి. రాబోయే 2025-26 బడ్జెట్‌లోనైనా కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం 15 శాతం నిధులను విద్యారంగానికి కేటాయిస్తుందేమో చూడాలి. ప్రతి మండలానికి అధునాతనమైన సౌకర్యాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో అందుకోసం రూ.500 కోట్లు ప్రతిపాదించింది. ఇప్పటి వరకు దాని అమలు కోసం ఎలాంటి కార్యాచరణను చేపట్టలేదు.

ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్

రాష్ట్రంలో ప్రతి ఏటా సమస్యలతోనే ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమవుతాయి. కానీ కాంగ్రెస్ మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లోమౌలిక వసతుల కల్పనకోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు వంటి పనులను చేపట్టింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఖర్చు చేసింది. ఏండ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.

పాఠశాలల్లో పారిశుద్ధ నిర్వహణ, పచ్చదనం పెంపు, మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించింది. దీంతో పాఠశాలల్లో ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావారణం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకనుగుణంగా నిర్వహణ గ్రాంట్‌ను ఇస్తున్నది. ఇంకోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తున్నది.

# ఈ-బస్సులతో ఆర్టీసీకి ముప్పు

**- కేంద్ర ప్రభుత్వ భారీ సబ్సిడీ ప్రయివేటు సంస్థలకు మాత్రమే..**
**- డ్రైవర్లు, మెకానిక్‌ల పరిస్థితి అగమ్యగోచరం..**
**- కొనసాగుతున్న సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ**
**- ఆర్టీసీలో 2030 నాటికి పూర్తిగా- బస్సులు**



వరంగల్: విద్యుత్ బస్సులను (ఈ-బస్సులు) ఆర్టీసీలో ప్రవేశపెట్టడం వల్ల ఆర్టీసీ ప్రయివేటు సంస్థగా మారే ప్రమాదముందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే కాలుష్య నివారణ పేరుతో ఈ-డ్రైవ్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా ఈ-బస్సులను రంగంలోకి దింపింది. డీజిల్ బస్సుల వల్ల శబ్ధకాలుష్యంతోపాటు వాయుకాలుష్యం అధికమవుతుందని, దీన్ని నివారించడంలో భాగంగానే ఈ-బస్సులను ప్రవేశపెడుతున్నట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధాన పత్రంలో పేర్కొన్నాయి. ఇది చదవడానికి, చూడడానికి బాగానే ఉన్నా, ఈ-బస్సుల తయారీ, ఆపరేటింగ్ చేయడం వంటి వాటిని ప్రయివేటు కంపెనీలకు కేంద్రం అప్పగించడంతో పాటు వాటికే భారీ సబ్సిడీలను ఇస్తోంది.ఇది ప్రభుత్వ రంగంలోని ఆర్టీసీ వంటి సంస్థలకు కాకుండా, ప్రయివేటు సంస్థలకు ఇవ్వడమంటే ప్రయివేటీకరణను ప్రోత్సహించడమేనన్నది అర్థమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఆర్టీసీ వంటి సంస్థలను ప్రయివేటుపరం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంగా కనిపిస్తోందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు అంటున్నాయి. ఆర్టీసీలో ఒక్క బస్సుకు ఆరుగురు సిబ్బంది అవసరం. 1:6 నిష్పత్తిలో నియామకాలను చేపట్టేవారు. విద్యుత్ బస్సులు రంగ ప్రవేశం చేస్తే ఈ నియామకాలు పూర్తిగా నిలిపివేసే అవకాశముంది. విద్యుత్ బస్సుల రంగ ప్రవేశంతో 1:1 సిబ్బంది మాత్రమే ఉండే అవకాశముంది. ఈ-బస్సులకు 1 కిలోవాట్‌కు రూ.10 వేల సబ్సిడీని కేంద్రం ఇస్తుంది. ఇదే సబ్సిడీని ప్రభుత్వరంగంలోని ఆర్టీసీ కార్పొరేషన్‌లకు ఇస్తే ఎంతో లాభదాయకంగా ఉండేదని కార్మికులు అంటున్నారు. 2030 నాటికి రాష్ట్రంలో 9,300 డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను నడపడానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో ఇప్పటికే 190 విద్యుత్ బస్సులు తిరుగుతున్నాయి. హైదరాబాద్‌లోనే 115 విద్యుత్ బస్సులు తిరుగుతున్నాయి. ఈ ఏడాది హైదరాబాద్‌లో 1000 విద్యుత్ బస్సులు, 2026 నాటికి మొత్తం 2,800 విద్యుత్ బస్సులు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది.

# సాగు భూముల పైలట్ సర్వే

**- రైతు భరోసా పథకం కోసం ప్రభుత్వం కసరత్తు**
**- 20కి పైగా జిల్లాల్లో మండలానికి ఓ గ్రామంలో సర్వే**
**- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 44 గ్రామాల్లో 42వేల ఎకరాల్లో..**




ఖమ్మం : రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. నిర్వహించిన మంత్రిమండలి సమావేశంలో జనవరి 26వ తేదీ నుంచి సాగులో ఉన్న భూములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా అర్హుల నిర్ధారణకు శాటిలైట్ సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని తొలుత భావించింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో మండలానికో గ్రామం చొప్పున పంటల నమోదు ప్రక్రియ చేపట్టనుంది. ఆ వివరాలను యాప్‌లో నమోదు చేసి శాటిలైట్ సర్వేతో సరిపోల్చాలని భావిస్తోంది. దీని ప్రకారం ఈ నెల 8వ తేదీలోగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మొత్తం 44 గ్రామాల్లోని 42,000 ఎకరాల్లో సర్వే చేస్తారు. సోమవారం నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుంది. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో విస్తరణ అధికారులు పంటల నమోదు చేపడతారు. ఖమ్మం జిల్లాలో 41 గ్రామాల్లో 20,500 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 43 గ్రామాల్లో 21,500 ఎకరాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 20కి పైగా జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే నిర్వహిస్తారు.

పైలట్ ప్రాజెక్టుగా సర్వే

గతంలో పంటల నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం.. 20 జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద శాటిలైట్ సర్వే నిర్వహించింది. గతేడాది డిసెంబర్ 20 నుంచి 23 వరకు.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ సర్వే జరిగింది. మొత్తం 144 మండలాల్లోని 318 క్లస్టర్లలో ఈ ప్రక్రియ పూర్తిచేసి, సాగు భూములను పక్కాగా లెక్కించారు.

# జనం గొంతుకగా నిలవండి

**- మీకు అండగా వేముంటాం :డిజిటల్ మీడియా జర్నలిస్టులతో నాయకులు**



హైదరాబాద్: సామాన్య ప్రజల గొంతుకగా డిజిటల్ మీడియా నిలవాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ప్రజా ప్రభుత్వం %-% ప్రజాస్వామ్యం -డిజిటల్ మీడియా పాత్ర, హక్కుల సాధనకై ఏం చేద్దాం? అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర సమాచార కమిషన్ మాజీ చైర్మెన్ మాడభూషి శ్రీధర్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్‌లతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు హన్మేష్, ఐఫ్టీయూ నాయకురాలు సునీత తదితరులు పాల్గొని మాట్లాడారు. నోరు లేని అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తెస్తున్న డిజిటల్ మీడియా జర్నలిస్టులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పాశం యాదగిరి మాట్లాడుతూ లగచర్లలో రైతుల ఆందోళన, నిర్మల్ ఇథనాల్ ఫ్యాక్టరీపై ప్రజల వ్యతిరేకత తదితర ఘటనలను డిజిటల్ మీడియానే మొదట వెలుగులోకి తెచ్చిందని కొనియాడారు. దేశం నాశనమైపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక డైరెక్షన్, శిక్షణతో డిజిటల్ మీడియా ప్రభావవంతమైన వార్తలతో, పామరుల భాషతో సామాన్యుల చుట్టూ తిరగాలని ఆకాంక్షించారు. అందరం కలిసి సహకార ఉద్యమంలా ముందుకెళ్దామని సూచించారు.

మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ డిజిటల్ మీడియా ప్రాధాన్యత కలిగిన మీడియా అని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రధాన మీడియా సహకరించకున్నా డిజిటల్ మీడియానే జనం గొంతుకు వేదికగా మొదట నిలిచిందని ఉదహరించారు. సోషల్ మీడియా అంటే సివిల్ మీడియా (పౌరశక్తి) అని అభివర్ణించారు. డిజిటల్ మీడియా కట్టడికి ప్రభుత్వాలు చట్టాలను దుర్వినియోగం చేయకుండా అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలని సూచించారు.

గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ మీడియాలో పెట్టుబడి పెట్టిన ఒక సామాజిక వర్గం దాని ప్రయోజనాలను పొందిందని తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ కావడానికి సోషల్ మీడియా సహకారమే కారణమని చెప్పారు. సమాచార హక్కు చట్టం కార్యకర్తలతో కలిసి పని చేయాలని సూచించారు. ధరణి పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందనీ, జీహెచ్ఎంసీ పరిధిలో 25 వేల ఎకరాల దళితులు, పేదల భూములను తీసుకున్నారని ఆరోపించారు. హైదరాబాద్ హవాలా పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతి జరుగుతుందన్నారు. ఇలాంటి వాటిని వెలుగులోకి తేవాలని సూచించారు. అదే సమయంలో పాలకవర్గాల నుంచి వచ్చే వ్యతిరేకత, ఒత్తిడిని తట్టుకునేలా డిజిటల్ మీడియాకు చట్టపరంగా అండగా నిలిచే సైన్యం అవసరమని తెలిపారు.

డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (డీఎంజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో 30 మంది డిజిటల్ జర్నలిస్టులు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించాలనీ, ఈ మీడియా నుంచి రిపోర్టింగ్ చేస్తున్న వారిని జర్నలిస్టులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ డిజిటల్ మీడియాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు నిర్వహించ గలుగుతాము

**ఎస్పీ అఖిల్ మహాజన్**

రాజన్న సిరిసిల్ల: నిత్యం యోగా సాధనతో ఆరోగ్యంపై పట్టుసాధించవచ్చు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నిరంతరం విధులు నిర్వహించే పోలీసులు నిత్యం యోగా సాధనతో తమ ఆరోగ్యంపై పట్టు సాధించవచ్చని, నిత్యజీవితంలో యోగ ఒక అలవాటుగా మార్చుకోవాలని జిల్లా ఎస్పీ అధికారులకు, సిబ్బందికి పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద యోగా కార్యాక్రమాన్ని నిర్వహించి యోగా నిపుణులచే పోలీస్ అధికారులకు, సిబ్బందికి యోగాలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. పోలీస్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు విధి నిర్వహణలో ఉండటం వలన తమ ఆరోగ్యం పట్టించుకోక పోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని ఆరోగ్యంపై అవగాహన ఎంతో ముఖ్యమని, సిబ్బంది,అధికారులు ఆరోగ్యం పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు దినచర్య, జీవన విధానం మిగతావారితో పూర్తి భిన్నంగా ఉంటుందని, ఇందుకుగానూ మన ఆరోగ్య పరిరక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకొనక తప్పదని అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం, యోగ వంటివి మన దినచర్యలో భాగం చేసుకోవాలని. ప్రస్తుత పరిస్థితు ల్లో వ్యాధులు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయని వ్యాధుల బారిన పడ కుండా ఉండేందుకు తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదని అన్నారు.ఈ కార్యక్రమములో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్ర శేఖర్ రెడ్డి, ఆర్ఐ లు మధుకర్, రమేష్, సిఐ లు మొగిలి, మధుకర్, శ్రీనివాస్, ఎస్ఐ లు ఆర్.ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 11 నుంచి స్కూళ్లు, కాలేజీలకు సంక్రాంతి సెలవులు




హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు ఈనెల 11 నుంచి సంక్రాంతి పండుగ సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. అకడమిక్ క్యాలెండర్‌లో ఈనెల 13 నుంచి 17 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఈనెల 11న రెండో శనివారం, 12న ఆదివారం కావడంతో అదనంగా రెండు రోజులు సెలవులొచ్చాయి. దీంతో ఈనెల 11 నుంచి 17 వరకు ఏడురోజులపాటు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈనెల 11 నుంచి 16 వరకు ఆరురోజులపాటు జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెవలుంటాయి. ఈనెల 18న పాఠశాలలు, 17న జూనియర్ కాలేజీల్లో తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి.

# పిల్లలు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఆస్తి హక్కు రద్దు

హైదరాబాద్: తల్లిదండ్రుల సంరక్షణ పోషణ నైతిక చట్టపరమైన బాధ్యతగా పేర్కొంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. తల్లిదండ్రులను చూసుకోవడం పిల్లల నైతిక బాధ్యత మాత్రమే కాదు, న్యాయప రమైన బాధ్యత కూడా అని సుప్రీంకోర్టు తాజా నిర్ణయం లో పునరుద్ఘాటించింది.తల్లిదండ్రులను కాపాడుకోవడం ఆర్థిక బాధ్యత మాత్రమే కాదు, సామాజిక, నైతిక బాధ్యత అని, దానిని నెరవేర్చడం పిల్లల బాధ్యత అని కోర్టు పేర్కొంది. ఆ బాధ్యతను విస్మరించిన కూతురు, కుమారులకు తల్లిదండ్రుల ఆస్తిని పొందే హక్కు లేదని కోర్టు తేల్చి చెప్పింది. వృద్ధాప్యంలో అమ్మా నాన్నల బాగోగులన్నీ చూసుకుంటానని హామీనిచ్చి, వారి నుంచి ఆస్తి పొందిన కుమారుడు ఇచ్చిన మాట తప్పడంతో ఓ కన్న తల్లి కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం.. ఆ కుమారుడికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసింది. అనంతరం ఆస్తి పై వృద్ధుల హక్కును పునరుద్ధరించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. బిడ్డల నిరాదరణకు గురయ్యే తల్లిదండ్రులకు 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం అండగా నిలుస్తుందంటూ పేర్కొంది. ఈ చట్టం ప్రకారం ఏర్పాటైన ట్రైబ్యునళ్లు. కన్నవారిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన బిడ్డల విషయంలో సత్వర విచారణ జరుపుతాయని పేర్కొంది. ఇలాంటి వివాదాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చిన ఆస్తిపై యాజమాన్య హక్కులు తిరిగి వాళ్లకే దక్కేలా ఆదేశించే అధికారం ఆ ట్రైబ్యునళ్లకు ఉంటుందని న్యాయస్థానం స్పష్టంచేసింది.

తద్వారా వృద్ధులైన తల్లి దండ్రులకు ఆర్థికపరమైన భరోసా లభిస్తుందని పేర్కొంది. మిగిలిన ఆస్తిని కూడా ఇచ్చేయాలంటూ తమపై కన్న కొడుకే నిర్దాక్షిణ్యంగా దాడి చేస్తున్నా డంటూ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తార్‌పుర్‌కు చెందిన ఓ మహిళ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.అతనికి అప్పటికే గిఫ్ట్ డీడ్ గా కొంత ఆస్తిని ఇచ్చామని చెప్పుకొచ్చారు. ప్రేమ, ఆప్యాయతలు కనుమరుగైన పరిస్థితుల్లో ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి ఆస్తిపై తమ హక్కును పునరుద్ధరించాలని ఆమె న్యాయస్థానాన్ని వేడుకుంది.

# నవోదయలో కీచకులు

- విద్యార్థినులపై లైంగిక వేధింపులు
- నలుగురు ఉపాధ్యాయులపై పోక్సో కింద కేసు, రిమాండ్
- సెటిల్‌మెంట్ కోసం చక్రం తిప్పిన వైస్ ప్రిన్సిపల్.. కేసు నమోదులో ఆలస్యం




నిజాంసాగర్: ఉన్నత భవిష్యత్తు కోసం తల్లిదండ్రులను విడిచి.. విద్యాలయంలోని ఉపాధ్యాయులను తల్లిదండ్రులుగా భావించి విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి వచ్చిన విద్యార్థినిలపై కీచకరూపంలో ఉన్న పలువురు ఉపాధ్యాయులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన నవోదయ విద్యాలయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా.. సదరు విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ కేసులు కాకుండా ప్రయత్నించినట్టు సమాచారం. కాగా కేసు నమోదయినా పోలీస్ స్టేషన్ నుంచి వివరాలు అందకపోవడం గమనార్హం. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లోని నవోదయ విద్యాలయంలోని నలుగురు ఉపాధ్యాయులపై పోక్సో కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగుజూసింది. వివరాల్లోకి వెళ్తే.. నవోదయ విద్యాలయంలో పలువురు ఉపాధ్యాయులు కొద్ది రోజులుగా విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు సమాచారం. గత డిసెంబర్ నెలలో పాఠశాలలో క్లాస్ అయిపోయాక లంచ్‌కు వెళ్లే క్రమంలో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థినిని క్లాస్‌రూమ్‌లోనే ఉంచేవాడని, తోటి విద్యార్థులు ఆమెతో ఉండగా వారిని తిట్టి వెళ్లిపొమ్మని చెప్పి ఆ విద్యార్థినిని లైంగికంగా ఇబ్బంది పెట్టేవాడని సమాచారం. అంతేకాదు, ల్యాబ్ రూమ్‌లోనూ వేధింపులకు పాల్పడినట్టు తెలిసింది. అయితే గతేడాది డిసెంబర్ 22వ తేదీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగడంతో పూర్వ విద్యార్థులకు బాధిత విద్యార్థిని స్నేహితులు విషయాన్ని చెప్పడంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిని వేరే ప్రాంతానికి బదిలీ చేస్తూ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. ఇదిలా ఉంటే అతన్ని కాపాడటానికి వైస్ ప్రిన్సిపాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి ఆలస్యం చేశాడని ఆరోపణలు ఉన్నాయి. సెటిల్‌మెంట్ చేసే ప్రయత్నం చేసినట్టు వినికిడి. సదరు ఉపాధ్యాయుడిని అరెస్టు చేసిన నాలుగు రోజుల తర్వాత నవోదయ పాఠశాలకు చెందిన మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు విద్యార్థులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సైతం సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. విషయం బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# తేలని ఆర్ఆర్ఆర్ భూసేకరణ

- ఇప్పటికే ఉత్తర భాగం టెండర్లకు పిలుపు
- 2013 చట్టం అమలుకు ఎన్‌హెచ్ఏఐ 'నో' ?
- భూములిచ్చేది లేదంటున్న రైతులు



హైదరాబాద్: ప్రాంతీయ బాహ్య వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి సంబంధించిన భూసేకరణపై నెలకొన్న సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. నష్టపరిహారం విషయంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)కు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సమన్వయం కుదరడం లేదు. దీంతో రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారుల నిర్మాణంలో ఎదురవుతున్న భూసేకరణ సమస్య పరిష్కారానికి మరింత సమయం పట్టే అవకాశం కనిపిస్తున్నది. ఇటీవల ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో భేటీ అయ్యారు. ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి ఇప్పటికే టెండర్లు పిలవగా, ఇంకా పలు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తికాకపోవడం గమనార్హం. భూములకు బదులు భూములివ్వాలనీ, లేని పక్షంలో బహిరంగ మార్కెట్ ధర ప్రకారం తమకు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు, భూయజమానుల డిమాండ్‌గా ఉన్నది. అయితే, ఎన్‌హెచ్ఏఐ మాత్రం నోటిఫికేషన్ జారీచేసే నాటికి ఉన్న ధర ప్రకారమే నష్ట పరిహారం చెల్లించేందుకు నిబంధనలు అనుమతిస్తాయని చెబుతున్నది. దీంతో ఉత్తర భాగం పనులకు కాంట్రాక్టర్లు ముందుకొచ్చి టెండర్లు వేస్తారా అనేది చర్చనీయాంశమైంది. మరోవైపు, ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే చేపడతామని ప్రకటించి వెనక్కి తగ్గింది. దక్షిణ భాగం కూడా కేంద్రమే చేపట్టాలని కేంద్రానికి ఇటీవల లేఖ రాసిన విషయం విదితమే. అంతేకాదు, దక్షిణ భాగం అలైన్‌మెంటులో కొన్ని మార్పులు చేర్పులు జరిగాయి. గతంలో ఖరారుచేసిన అలైన్‌మెంటుకు మరో ఐదు కిలోమీటర్ల వరకు పెరిగినట్టు సమాచారం. దీంతో సేకరించాల్సిన భూములు సైతం అధికం కానున్నాయి. ఈ విషయమై కేంద్రం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే. ఆర్ఆర్ఆర్‌కు సేకరిస్తున్న భూములకు సంబంధించి నష్ట పరిహారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలనే ఒప్పందం ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వాన్ని కాదని రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారాన్ని పెంచే అవకాశం కూడా లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ నష్ట పరిహారం పెంచాలని నిర్ణయిస్తే, ఆ మేరకు అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని సమాచారం. ఆర్ఆర్ఆర్ భూసేకరణ నష్ట పరిహారం విషయంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే అధికారాన్ని ప్రభుత్వం ఇటీవలే జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. దీంతో రైతులు కోరుతున్న విధంగా నష్ట పరిహారాన్ని కలెక్టర్లు నిర్ధారించినప్పటికీ. ఆ మేరకు సగం భారం భరించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఒప్పుకోవడంలేదు. గత గురువారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శితో జరిగిన సమావేశం ఫల ప్రదం కాలేదు. దీంతో ఎన్‌హెచ్ఏఐ అదికారులు సీఎంతో శుక్రవారం భేటీ అయ్యారు. రైతులకు, భూయజమానులకు ఉదారంగా పరిహారం చెల్లించాలని సీఎం సూచించిన విషయం విదితమే.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



మిర్యాలగూడ: గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో పట్టణ పేద ప్రజల కోసం నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను సీపీఐ(ఎం) నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఆరేడు సంవత్సరాల కిందట పేద ప్రజల కోసం ఇండ్లు నిర్మించారని, అక్కడ మౌలిక వసతులు లేకపోవడంతో పంపిణీ చేయలేదని అన్నారు. దాంతో ఆ ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. అప్పటి నుంచి అక్కడ మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక ఆందోళన చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆ ఇండ్ల విషయంపై పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఇండ్లు వథాగా ఉన్నాయని, వాటిని వెంటనే పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో లక్కీ డ్రా ద్వారా లబ్దిదారులను ఎంపిక చేశారని, వారికైనా ఆ ఇండ్లను కేటాయించాలని, లేదంటే ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ లబ్దిదారులను గుర్తించి ఇవ్వాలని కోరారు. అక్కడ రోడ్లు, డ్రయినేజీ, వీధి దీపాలు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. సోమవారం మండల, జిల్లా కేంద్రాల్లో సంబంధిత అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, టూ టౌన్ కార్యదర్శి భవాండ్ల పాండు, మండల కార్యదర్శి మూడవత్ రవి నాయక్, నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, రేమిడాల పరుశరాములు, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్, గోవర్దన్, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

# డ్యాం పటిష్టతకు నిధుల కోసం ప్రతిపాదనలు

- పరిశీలనానంతరం ఉన్నతాధికారులకు నివేదిక
- సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కేంద్రీయ జలశక్తి సభ్యులు



నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టును శనివారం కేంద్రీయ జలశక్తి కమిషన్ సభ్యులు పరిశీలించారు. నాగార్జునసాగర్ ప్రధాన డ్యామును, గ్యాలరీలను, వాక్ వే, స్పిల్ వే, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రీయ జలశక్తి సీనియర్ జాయింట్ కమిషనర్ సంజరు కుమార్ సింగ్ మాట్లాడుతూ.. డ్యాం రీహాబిలిటేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాంలో (డి ఆర్ఐపి) భాగంగా శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించి పరిశీలించామని చెప్పారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని పలు విభాగాలను పరిశీలించామన్నారు. ప్రాజెక్టుల పటిష్టత కోసం చేపట్టాల్సిన పనుల గురించి పరిశీలించి.. నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. కృష్ణానది జలాల వినియోగంలో ఆంధ్ర, తెలంగాణ మధ్య విబేధాలను కూడా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. నాగార్జునసాగర్ డ్యాం పటిష్టతకు ఇరిగేషన్ అధికారులు గతంలోనే 160 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు తయారు చేశారని, తమ సందర్శన పరిశీలన అనంతరం నివేదికను కేంద్రీయ జలశక్తి ఉన్నత అధికారులకు అందజేస్తామని చెప్పారు. ఈ బృందంలో కేంద్రీయ జలశక్తి జాయింట్ కమిషనర్ మనోజ్ కుమార్, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు డీఈ అజరు యాదవ్, జేఈ రాజేష్, స్థానిక ఎస్సీ శ్రీధర్ రావు, ఈఈ మల్లికార్జునరావు, డీఈ శ్రీనివాస్, ఏఈలు సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# కమలంపై గులాబీ సాఫ్ట్ కార్నర్...

హైదరాబాద్: బీజేపీతో వైరం పెంచుకోవద్దని బీఆర్ఎస్ భావిస్తున్నదా? అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. అధికారంలో ఉన్నంతకాలం బీజేపీని తూర్పారబట్టిన గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా గెలవకపోవడంతో సైలెంట్ అయిపోయారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితపై ఈడీ (ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) కేసు నమోదు చేసినప్పుడు రాజకీయంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక ఆడపిల్లపై బీజేపీ కేసు పెట్టించింది, బెదిరింపులకు భయపడేది లేదు, చిల్లర రాజకీయాలతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు అంటూ కేసీఆర్, కేటీఆర్ అనేక సందర్భాల్లో వ్యాఖ్యానించారు. కవిత సైతం బీజేపీ మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ, అదే ఈడీ ఇప్పుడు కేటీఆర్‌పైన ఫార్ములా ఈ ? రేస్ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ (ఈసీఐఆర్) నమోదు చేసి విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసు జారీ చేస్తే ఒక్క మాట కూడా అనలేదు. ఇదే ఇప్పుడు గులాబీ లీడర్లలో చర్చకు దారితీసిందిఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని కేటీఆర్ తరచూ మీడియా సమావేశాల్లో, చిట్‌చాట్‌లలో విమర్శిస్తున్నారు. కానీ, ఈడీ కేసు పెట్టిన విషయంలో, నోటీస్ ఇచ్చిన అంశంలో మాత్రం బీజేపీని పల్లెత్తు మాట అనడం లేదు. కేటీఆర్ మాత్రమే కాకుండా హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలెవ్వరూ బీజేపీపై ఈ విషయంలో కామెంట్ చేయలేదు. భవిష్యత్తులో మరిన్ని ఈడీ కేసులు వస్తాయేమో, బీజేపీని ఇప్పుడు విమర్శిస్తే ఇబ్బందులుంటాయేమో అన్న భయంలో, ఆ పార్టీకి దగ్గర కావాలన్న ఉద్దేశంతో ఇప్పుడు విమర్శలు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారేమో అని గుసగుసలు వినిపిస్తున్నాయి. జనగణనలో కులగణన చేయాలని బీజేపీని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత ఒత్తిడి పెంచుతున్నా బీఆర్ఎస్ నేతలెవ్వరూ బీజేపీని కనీసంగా కూడా ప్రస్తావించడం లేదు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ తీరును తప్పుపట్టిన బీఆర్ఎస్, ఇప్పుడు ఫార్ములా ఈ ? రేస్ విషయంలో భిన్న వైఖరి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కేటీఆర్‌ను ఈడీ చర్యల నుంచి కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే బీజేపీకి ఆగ్రహం కలిగించకుండా ఆచితూచి వ్యవహరిస్తున్నదనే అభిప్రాయాలు గులాబీ లీడర్లలో నెలకొన్నాయి. ఒకే పార్టీలో ఈడీ పట్ల వేర్వేరు సందర్భాల్లో రెండు రకాల పరిణామాలు చోటుచేసుకోవడం పలువురిని ఆచలోనలో పడేసింది. ఎలాగైనా కేటీఆర్‌ను ఈడీ కేసు నుంచి సేవ్ చేసుకోడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నదనే మాటలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నుంచీ బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు, విలీనం చర్చలు జరుగుతూ ఉన్నాయని ఊహాగానాలు బలంగానే వినిపించాయి. సంధి దశలో బీజేపీపై ఎలాంటి కామెంట్లు చేసినా అది ఇబ్బందికి కారణమవుతుందేమోననే ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగానే ఫార్ములా ఈ ? రేస్ విషయంలో ఈడీని, బీజేపీని విమర్శించడం లేదనే మాటలు వినిపిస్తున్నాయి.

# కన్ఫ్యూజన్ లో గులాబీ కేడర్

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారా? పార్టీ వ్యవహారాలను కేటీఆర్ లేదా కవితకు అప్పగించారా? పార్టీ కేడర్ ఎందుకు కన్ఫ్యూజన్‌లో పడింది? సీఎం రేసు కోసం కేటీఆర్–కవిత పోటీ పడుతున్నారా? ఇదే చర్చ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను వెంటాడుతోంది. అధికారం పోయిన తర్వాత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది బీఆర్ఎస్. నేతల వలసలు కాసేపు పక్కన బెడితే.. వయోభారం కారణంగా మాజీ సీఎం కేసీఆర్ మునుపటి మాదిరి గా రాజకీయాల్లో యాక్టివ్ కాలేకపోతున్నారు. ఇక అసలు విషయానికొద్దాం..పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు, రెండు వారాల కిందట ఫ్యామిలీ సభ్యులతో కేసీఆర్ సమావేశమయ్యార. దీనికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మరో ముగ్గురు కీలక నేతలు హజరయ్యారు. అనారోగ్యం, వయో భారం కారణంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనే ఆలోచన బయటపెట్టారట. పార్టీకి కావాల్సిన సలహాలు మాత్రం ఇస్తానని, మీ ముగ్గురు పార్టీ వ్యవహారాలు చూసుకోవాలని చెప్పారట పెద్దాయన. ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా తాను కొద్దిరోజులు కంటిన్యూ అవుతానని అన్నారట. వీలు కుదిరినప్పుడు అసెంబ్లీకి వచ్చి వెళ్తానని, సమావేశాలు సైతం మీరే చూసుకోవాలని తెలిపారట. అయితే పార్టీలో ఎవరికి ఏయే పదవులు అన్నదానిపై నోరు ఎత్తలేదని తెలుస్తోంది. ఇటీవల మీడియాతో చిట్ చాట్ చేసిన కేటీఆర్, ప్రస్తుతం కేసీఆర్ రెస్టు తీసుకుంటున్నారని అన్నారు. అంతేకాదు పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని చెప్పడం వెనుక ఉద్దేశం ఇదేనని అంటున్నారు. దీంతో అధ్యక్షుడు పోటీకి కేటీఆర్–కవిత మధ్య పోటీ నెలకొందని తెలుస్తోంది. కార్యకర్తలతో సమావేశం పెట్టినప్పుడల్లా హార్డ్ కోర్ అభిమానులు మాత్రం కేటీఆర్ సీఎం.. కవిత సీఎం స్లోగన్ చేయడం కూడా అధిపత్యం ఎవరి ఎత్తులు వారు వేస్తున్నట్లు చెబుతున్నారు పార్టీ నేతలు. జరుగుతున్న పరిణామా లను గమనించిన కారు పార్టీ కార్యకర్తలు కాసింత డైలామాలో పడిపోయారు. రేపోమాపో స్థానిక ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల ముందు ఈ తరహా కన్ఫ్యూజన్ కరెక్ట్ కాదనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనివల్ల కేడర్ చెదిరిపోయే పరిస్థితి తలెత్తవచ్చని అంటున్నారు. పార్టీ వ్యవహారాలు కేటీఆర్–కవిత చుట్టూ తిరగడంతో హరీష్‌రావు మద్దతుదారులు ఆసక్తి గమనిస్తున్నారు. పార్టీలో ఇంత జరుగుతున్నా, తమ అభిమాన నేత నోరు మెదప పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. దీనిపై అప్పుడే పార్టీలో చిన్నపాటి చర్చ మొదలైపోయిందిఒకప్పుడు రూరల్‌గా బలంగా ఉండేది కారు పార్టీ. మొన్నటి ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లు ఝలక్ ఇచ్చారు. ఈ క్రమంలో పార్టీలో అంతర్గత వ్యవహారాలు కేడర్‌తోపాటు నేతలకు మింగుడుపడడం లేదు. ఈ వ్యవహారం రాబోయే రోజుల్లో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వెయిట్ అండ్ సీ.

# చంపేస్తున్న చలి

హైదరాబాద్: తెలంగాణలో రోజురోజుకి చలి తీవ్రత విపరీతంగా పెరుగుతుందని వాతావరణశాఖ చెప్పింది. గతేడాది కంటే ఈసారి ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా పడిపోతున్నాయని అధికారులు ప్రకటించారు. ఇదిలా ఉంటే రెండు రోజుల నుంచి తెలంగాణలో ఉన్నట్లుండి చలి విపరీతంగా పెరుగుతుంది. రాబోయే రోజుల్లో దక్షిణాది జిల్లాల కంటే ఉత్తరాదిలో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు వివరించారు. తెలంగాణలో శీతాకాలం మొదలు సాధారణ స్థాయి కంటే చలి తీవ్రత చాలా ఎక్కువే ఉందని ఆయన వివరించారు. సాధారణ ఉష్ణోగ్రతలు చూసుకుంటే ఆదిలాబాద్లో 12.8 డిగ్రీల నుంచి 7.2 డిగ్రీల దిగువకు పడిపోయాయి. అలా అన్ని జిల్లాల్లో 2 నుంచి 4 డిగ్రీల వరకు నమోదు అవుతున్నట్లు చెప్పారు. రోజుల్లో తెలంగాణలోని ఉత్తరాది జిల్లాలైన ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో చలి తీవ్రత భారీగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ మూడు జిల్లాలో ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. సంక్రాంతి సమయంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు. రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుకుగా వీస్తున్నాయని, దాని ప్రభావంతోనే గత రెండు రోజులుగా చలి తీవ్రత బాగా పెరిగినట్లు వాతావరణ శాఖ అధికారి చెప్పారు. ఈశాన్య గాలులతో పాటు రాష్ట్రంపై తూర్పు గాలుల ప్రభావం కూడా ఉందన్నారు. ఈ గాలుల కారణంగా ఉదయం వేళ దట్టమైన పొగ మంచు కురిసే అవకాశం బాగా ఉందని చెప్పారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రతో పాటు పొగ మంచు ఎక్కువగా కురవనున్నట్లు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్లో సాధారణం కంటే 2 డిగ్రీలు తక్కువ నమోదు అవుతున్నాయి. రానున్న మూడు రోజులు కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిపోయింది. సంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోయాయి. అత్యంత కనిష్ఠంగా కుమురంభీం జిల్లా సిర్పూర్, గిన్నెదారిలో 6.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 7.7, కుమురంభీం జిల్లా తిర్యానీలో 7.9, ఆల్గోల్‌లో 7.6 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మోరీన్‌పేటలో 7.3 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 6.9 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలలో 7.1 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా ఆర్లీలో 7.2, , ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక హైదరాబాద్‌లో అత్యంత కనిష్ఠంగా హెచ్సీయూ, బీహెచ్ఐఎల్ 8.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా రాజేంద్రనగర్‌లో 9.4, మౌలాలీలో 9.6, శివరామ్‌పల్లిలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

# మంజాపై ఉక్కు పాదం

వరంగల్: నిషేధిత మాంజా దారం విక్రయిస్తున్న వ్యాపారులపై వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు కొరడా ఝుళిపించారు. చైనా మాంజాను విక్రయిస్తుండటం వల్ల పక్షులకే కాకుండా మనుషులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా నిబంధనలకు విరుద్ధంగా మాంజా అమ్ముతున్న వ్యాపారులపై పోలీసులు నిఘా పెట్టారు. వరంగల్ సెంట్రల్ జోన్ కాజీపేట పీఎస్ పరిధిలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కాజీపేట విష్ణుపురి కాలనీలో గాలి పటాలు, చైనా మాంజా బిజినెస్ చేస్తున్న శనిగరపు అరవింద్, ఎండీ ఇస్సాక్, మంద శ్రీనాథ్, ఎండీ సాల్మన్ అనే నలుగురు వ్యాపారులను అరెస్ట్ చేశారు. వారి నుంచి మొత్తంగా రూ. 2.30 లక్షల విలువైన 115 బండిళ్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న మాంజా దారం బండిళ్లను కాజీపేట పోలీసులకు అప్పగించారు. సంక్రాంతి పండుగ సమయంలో సరదాగా ఎగురవేసే గాలి పటాలు.. జనాల ప్రాణాలు తీస్తున్నాయి. సాధారణ దారాలకు బదులు మార్కెట్‌లో చైనా మాంజా లభిస్తుండటంతో చాలామంది దానినే ఉపయోగిస్తున్నారు. నైలాన్, సింథటిక్ దారానికి ప్లాస్టిక్ పొడి పూసి మాంజాను తయారు చేస్తున్నారు. గాలి పటాలను ఎగురవేసే సమయంలో ఇతరుల పతంగుల దారాలను తెంపడం ఈ మాంజా దారంతో ఈజీ అవుతుంది. దీంతో చాలామంది ఈ చైనా మాంజానే వినియోగించేందుకు ఇష్టపడుతున్నారు. కానీ దాని వల్ల జరుగుతున్న ప్రమాదాల గురించి మాత్రం ఆలోచించడం లేదు. పతంగి తెగిన తరువాత గాలిలో వేలాడుతున్న మాంజా రోడ్లపై వెళ్లే ప్రజలకు చుట్టుకుని గాయాల పాలవుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. దీంతో మాంజా అమ్మకాన్ని రాష్ట్రంలో నిషేధించారు. దిగుమతి చాలా వరకు ఆగిపోగా.. మాంజాకు ఉన్న డిమాండ్‌తో కొంతమంది ఇక్కడే తయారు చేస్తున్నారు. ఫలితంగా మార్కెట్‌లో మాంజా అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. మాంజా దారంతో పక్షులతో పాటు ప్రజలకు ప్రమాదాలు జరుగుతున్నాయి. పతంగుల పండుగ స్టార్ట్ కాకముందే రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన వివిధ ఘటనలు మాంజా ఎంత డేంజర్ అనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కొద్దిరోజుల కిందట జనగామ జిల్లాకు చెందిన పదేళ్ల బాలుడు వీక్షిత్.. తల్లిదండ్రులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా గొంతు భాగంలో మాంజా తగిలి తీవ్ర గాయమైంది. ఆయన హాస్పిటల్‌లో చికిత్స పొంది ప్రాణాలు దక్కించుకున్నాడు. ఆ తరువాత బచ్చన్నపేటకు చెందిన సనత్‌కుమార్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి బండిపై వెళ్తుండగా.. మాంజా తగిలి సనత్ కుమార్ గొంతుకు తీవ్ర గాయమైంది. బైక్ అదుపు తప్పి కింద పడటంతో మిగతా ఇద్దరు స్నేహితులు గాయపడ్డారు. జనగామ పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో కూడా ఇటీవల మాంజా తగిలి నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిలో పదేళ్ల బాలుడు కూడా ఉన్నాడు. రెండు రోజుల కిందట చంద్రుగొండ మండలం గుర్రాయిగూడెం గ్రామానికి చెందిన ఏరువ కృష్ణారావు.. తన ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వైపు వెళ్తున్నారు. మాంజా గొంతుకు చుట్టుకుని వాయునాళం 75 శాతం వరకు తెలిగిపోయింది. మరో చేతితో మాంజా దారాన్ని పట్టుకునే ప్రయత్నం చేయగా ఆ చేతి వేళ్లకు కూడా గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. రెండు రోజుల కిందట షాద్‌నగర్‌కు చెందిన రంగనాథ్, తన భార్యతో కలిసి ముచ్చింతల్ వైపు నుంచి వస్తున్నారు. మాంజా కారణంగా రంగనాథ్ గొంతు కొంతమేర కోసుకుపోయింది. దాన్ని తొలగించే క్రమంలో రంగనాథ్ భార్య చేతులకు కూడా గాయాలు అయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో గురువారం బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలకు మాంజా దారం చుట్టు కోవడంతో.. వాళ్లిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.

# ఒక్క మ్యాచ్ ఆడకపోయినా కోటి సంపాదించాడు.. ఎవరా లక్కీ ఫెలో..!

క్రికెట్‌కు భారత్‌లో ఉన్నంత క్రేజ్ మరే దేశంలో ఉండదు. క్రికెట్ ప్లేయర్ల సంపాదన కోట్లల్లో ఉంటుందని అందరికీ తెలుసు. ముఖ్యంగా మన టీమిండియా ప్లేయర్ల సంపాదన మిగతా దేశాల ప్లేయర్ల కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది.

దేశంలో సినిమా సెలబ్రెటీలు ఎంత ఫేమస్సో.. క్రికెటర్లు కూడా అంతే ఫేమస్. అందుకే ఎన్నో ఇంటర్నాషనల్ కంపెనీల బ్రాండింగ్ కోసం క్రికెటర్లను బ్రాండ్ అంబాజిడర్లుగా పెట్టుకుంటారు. మనోళ్ల మ్యాచ్ ఫీజు కూడా భారీగా ఉంటుంది. ఐతే, ఇటీవల ఆసిస్‌తో ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ ఆడకుండానే ఓ ప్లేయర్ రూ. 1.25 కోట్లు సంపాదించాడు. అతడే చబ్బీ బాయ్ సర్ఫరాజ్ ఖాన్. ఇతడితో పాటు మరో ఇద్దరు ప్లేయర్లకు కూడా మ్యాచ్ ఆడకపోయినా భారీగా నగదు లభించింది. అదెలా అంటే.. టెస్ట్ మ్యాచ్ ఆడిన ప్రతి ప్లేయర్‌కు బీసీసీఐ మ్యాచ్ ఫీజు కింద రూ. 15 లక్షలు చెల్లిస్తుంది. ప్లేయింగ్ 11లో చోటు దక్కని ప్లేయర్‌కు కూడా ఒక్క మ్యాచ్‌కి రూ. 7.5 లక్షలు చెల్లిస్తారు. ఐతే, గతేడాది బీసీసీఐ మ్యాచ్ ఫీజులను పెంచుతున్నట్లు ప్రకటించింది. దీని ప్రకారం, ఒక టెస్ట్ సీజన్‌లో 50 శాతం టెస్ట్ ఆడే సభ్యుడు రూ. 30 లక్షలు, నాన్ ప్లేయింగ్ ఎలెవెన్ మెంబర్‌కు రూ. 15 లక్షలు అందుకుంటారు. 75 శాతం మ్యాచ్‌లు ఆడే సభ్యుడు రూ. 45 లక్షలు, ఆడని సభ్యునికి రూ. 22.5 లక్షలను బీసీసీఐ చెల్లిస్తుంది. ఇక, 15 మంది టీమ్ సభ్యులతో ఆసిస్‌కు వెళ్లిన భారత్.. కొందరిని ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడించకుండా డ్రెసింగ్ రూమ్‌కే పరిమితం చేశారు. ఈ సిరీస్‌తో టెస్టులో అరంగేట్రం చేసిన నితీష్ కుమార్ రెడ్డి రెండు మ్యాచ్‌లు ఆడి, ఒక సెంచరీ కూడా చేశాడు. ఇక యంగ్‌స్టర్స్ దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, ప్రసిద్ధ్ కృష్ణలకు




ఒక్కో మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. ఐతే, సీరిస్‌కు ఎంపికైన సర్ఫరాజ్ ఖాన్, అభిమన్యు ఈశ్వరన్, తనుష్ కోటియన్‌లు.. బెంచ్‌కే పరిమితమయ్యారు. ఈ ముగ్గురికి ఆడే అవకాశం రాకపోయినా.. డబ్బు మాత్రం బాగానే సంపాదించారు. ఐదు మ్యాచ్‌లకు గాను.. ఒక్కో మ్యాచ్‌కు రూ. 22.5 లక్షల ఫీజు లభించగా, సర్ఫరాజ్ మొత్తం రూ. 1,12,50,000 సంపాదించాడు. ఈశ్వరన్ 50 శాతం మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉన్నందున మ్యాచ్‌లకు రూ. 15 లక్షల చొప్పున రూ. 75 లక్షలు అందుకుంటాడు. మరోవైపు, కోటియన్ కేవలం 2 మ్యాచ్‌లకు మాత్రమే జట్టులో భాగమయ్యాడు. కాబట్టి అతను ప్రోత్సాహక పథకం కిందకు రాడు. అందుకే ఒక్కో మ్యాచ్‌కు రూ. 7.5 లక్షల చొప్పున, రూ. 15 లక్షలు లభిస్తాయి.

# వెన్ను గాయంతో బుమ్రా.. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఆడుతాడా?

ఆస్ట్రేలియా పర్యటనలో ఎదురైన ఘోర పరాజయంతో తీవ్ర నిరాశలో ఉన్న టీమిండియా అభిమానులను మరో విషయం కలవరపెడుతోంది. ఆసీస్ పర్యటనలో వెన్ను గాయానికి గురైన టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. అప్‌కమింగ్ ఐసీసీ టోర్నీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఆడుతాడా? లేదా? అనే విషయం ఆందోళనకు గురి చేస్తోంది.

ఆస్ట్రేలియాతో సిడ్నీ వేదికగా జరిగిన ఐదో టెస్ట్‌లో జస్‌ప్రీత్ బుమ్రాకు వెన్ను నొప్పి తిరగబెట్టిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో అత్యధిక ఓవర్లు బౌలింగ్ చేయడంతో అతని బ్యాక్‌పై అధిక లోడ్ పడింది. ఆఖరి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లోనే అసౌకర్యానికి గురైన బుమ్రా.. వెంటనే ఫిజియోలకు సమాచారమిచ్చాడు.

దాంతో అప్రమత్తమైన బీసీసీఐ మెడికల్ టీమ్ అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లి స్కానింగ్ తీయించారు. బుమ్రా తిరిగి వచ్చి బ్యాటింగ్ చేసినా.. రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేదు. బుమ్రా గైర్హాజరీలో స్వేచ్ఛగా ఆడిన ఆసీస్ ఆఖరి టెస్ట్‌ను 6 వికెట్ల తేడాతో గెలిచి 3-1తో సిరీస్ కైవసం చేసుకుంది. ఈ గెలుపుతో డబ్ల్యూటీసీ 2025 ఫైనల్ బెర్త్‌ను కూడా దక్కించుకుంది.

ఈ సిరీస్‌లో టీమిండియా ఓడినా.. బుమ్రా 9 ఇన్నింగ్స్‌ల్లో 32 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. దాంతో అతనిపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే బుమ్రా వెన్ను గాయంతో బాధపడుతున్నాని, అతన్ని బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చెప్పాడు. ఆ తర్వాత అతని గాయానికి సంబంధించిన అప్‌డేట్ ఎవరూ ఇవ్వలేదు. బీసీసీఐ కూడా ఇప్పటి వరకు బుమ్రా ఫిట్‌నెస్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

స్కానింగ్ రిపోర్ట్‌ల్లో ఏం వచ్చింది? బుమ్రా గాయం తీవ్రత ఎక్కువగా



ఉందా? మాములు గాయామా? అనే సందేహాలు అభిమానులను వెంటాడుతున్నాయి. ఒకవేళ బుమ్రాకు గ్రేడ్ 1 గాయి అయితే అతనికి 3 వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇదే జరిగితే ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లకు బుమ్రా దూరంగా ఉంటాడు. నేరుగా ఛాంపియన్స్ ట్రోఫీ ఆడుతాడు. కానీ గ్రేడ్ 2 గాయం అయితే మాత్రం బుమ్రా కోలుకోవడానికి 6 వారాల నుంచి 3 నెలల సమయం పడుతోంది. అదే జరిగితే ఛాంపియన్స్ ట్రోఫీ మొత్తానికి బుమ్రా దూరం కావాల్సి ఉంటుంది. అదే జరిగితే టీమిండియాకు ఎదురుదెబ్బే. బుమ్రా లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా రాణించడం చాలా కష్టం. గతంలోనూ బుమ్రా వెన్ను గాయంతో సుదీర్ఘ కాలం పాటు భారత జట్టుకు దూరంగా ఉన్నాడు. ఈ క్రమంలోనే బుమ్రాకు ఏం కాకుడదని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# కోహ్లీ, రోహిత్ కెరీర్ ముగిసినట్లేనా ?

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల సిరీస్ ముగిసింది. ఈ సిరీస్ లో భారత్ ను ఆద్యంతం దురదృష్టం వెంటాడింది. ముఖ్యంగా భారీ అంచనాలతో ఆస్ట్రేలియాలో అడుగుపెట్టిన స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. సిరీస్ ముగిసేనాటికి వారి టెస్టు కెరీర్లను ప్రమాదంలో పడేసుకున్నారు. దీంతో వీరిద్దరూ ఇక రిటైర్మెంట్లు ప్రకటించడమే తరువాయి అన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జట్టు కోచ్ గౌతం గంభీర్ ను వీరి భవిష్యత్తుపై ప్రశ్నిస్తే ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. ఆసీస్ తో టెస్టు సిరీస్ లో వైఫల్యాల తర్వాత సీనియర్ ఆటగాళ్లైన రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లీకి కోచ్ గౌతం గంభీర్ తాను వారికి అండగా నిలుస్తానని చెప్తూనే కీలక నిర్ణయం మాత్రం వారిదే అన్నాడు. తద్వారా వీరిద్దరూ గౌరవంగా గుడ్ బై చెప్పేయడమే మేలనే సంకేతాలు ఇచ్చేసాడు. తాను ఏ ఆటగాడి భవిష్యత్తు గురించి మాట్లాడలేనని, అది వారి ఇష్టమని తెలిపాడు. వారికి ఇంకా ఆకలి ఉందని, అభిరుచి కూడా ఉందని, వారు కఠినమైన వ్యక్తులని గౌతీ తెలిపాడు. వీరు భారత క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లగలరని ఆశిస్తున్నామని చెప్పుకొచ్చాడు. కానీ చివరిగా వాళ్లు ఏ ప్లాన్ చేసినా భారత క్రికెట్‌కు మేలు చేసేలా ప్లాన్ చేస్తారని మనందరికీ తెలుసంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించాడు. చాలా మంది ఫామ్‌లో




లేని బ్యాటర్‌లను మోసుకెళ్ళి జట్టు గెలవడం కష్టమని భావించినందునే ఐదో టెస్టుకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు గంభీర్ వెల్లడించాడు. డ్రెస్సింగ్ రూమ్ వివాదంపై స్పందిస్తూ.. ఆ గదిలో ఉ న్న ప్రతి ఒక్కరికీ తాను న్యాయంగా ఉండాలన్నారు. ఒకరిద్దరు వ్యక్తులతో మాత్రమే కాదన్నాడు. తాను ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులతో మాత్రమే న్యాయంగా ఉంటానంటే కుదరదన్నాడు. తద్వారా జట్టులో ప్రతీ ఆటగాడికీ న్యాయం చేసేందుకు ప్రయత్నించినట్లు గంభీర్ చెప్పుకొచ్చాడు.

# కెప్టెన్‌గా రోహిత్.. జైస్వాల్‌కు నో ఛాన్స్!

ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో దారుణంగా విఫలమైన టీమిండియా.. అప్‌కమింగ్ సిరీస్‌లపై ఫోకస్ పెట్టింది. ఈ నెల చివర్లో సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్ ఆడనున్న టీమిండియా..

వచ్చే నెలలో ఛాంపియన్స్ ట్రోఫీ 2025 బరిలోకి దిగనుంది. ఫిబ్రవరి 9 నుంచి మార్చి 9 వరకు పాకిస్థాన్ వేదికగా జరగనున్న ఈ టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరగనున్న విషయం తెలిసిందే.

భారత మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఈ టోర్నీకి ముందు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా సన్నాహకంగా వాడుకోనుంది. ఐసీసీ డెడ్‌లైన్ ప్రకారం ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగే జట్లను జనవరి 12లోపు ప్రకటించాల్సి ఉంది. ఈ క్రమంలోనే భారత సెలెక్టర్లు భారత జట్టు ఎంపికపై ఫోకస్ పెట్టారు. ముందుగా 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసి ఆ తర్వాత మార్పులు చేర్పులు చేయనున్నారు.

స్పిన్నర్లకు ప్రాధాన్యత..

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ వైఫల్యం నేపథ్యంలో సెలెక్టర్లు ఆచితూచి జట్టును ఎంపిక చేయనున్నారు. భారత్ మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. అక్కడి పిచ్‌లు స్పిన్‌కు అనుకూలంగా ఉండనున్నాయి. దాంతో భారత జట్టులో స్పిన్నర్లకు అధిక ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. స్పిన్ ఆల్‌రౌండర్స్ రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌తో పాటు కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్‌ల పేర్లను సెలెక్టర్లు పరిశీలించనున్నారు. ప్రస్తుతం కుల్దీప్ యాదవ్ సర్జరీ చేయించుకొని గాయం నుంచి కోలుకుంటున్నాడు. అతను పూర్తి ఫిట్‌గా లేకుంటే రవి బిష్ణోయ్‌కు మార్గం సుగుమం కానుంది.

# శుభ్‌మన్ గిల్‌పై వేటు.. బుమ్రాకు ప్రమోషన్?

ఆస్ట్రేలియా పర్యటనలో నిరాశాజనక ప్రదర్శన కనబర్చిన టీమిండియా.. పరిమిత ఓవర్లకు సిద్ధమవుతోంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో పాటు 3 వన్డేల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2024 ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9వ వరకు హైబ్రిడ్ మోడల్‌లో ఈ టోర్నీ జరగనున్న విషయం తెలిసిందే. ఈ టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండగా.. భారత్ మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఈ టోర్నీలో భారత జట్టును రోహిత్ శర్మ నడిపించనున్నాడు. అతని రిటైర్మెంట్‌పై వార్తలు రాగా.. వాటిని రోహిత్ ఖండించాడు. దాంతో రోహిత్ శర్మనే కెప్టెన్‌గా కొనసాగుతాడనే విషయంపై స్పష్టమైంది. ఆస్ట్రేలియా పర్యటనలోని ఘోర వైఫల్యం నేపథ్యంలో ఈ ఐసీసీ ఈవెంట్‌కు బలమైన జట్టును ఎంపిక చేయడంపై సెలెక్టర్లు ఫోకస్ పెట్టారు. ఐసీసీ డెడ్‌లైన్ ప్రకారం జనవరి 12లోపు టోర్నీలో పాల్గొనే 15 మంది సభ్యులతో కూడి జట్టును ప్రకటించాలి. ఈ క్రమంలోనే భారత సెలెక్టర్లు జట్టు ఎంపికపై ఫోకస్ పెట్టారు.

టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం భారత జట్టులో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ రాగా.. టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ నియమితులయ్యాడు. శుభ్‌మన్ గిల్‌ను పరిమిత ఓవర్ల వైస్ కెప్టెన్‌గా నియమించారు. భవిష్యత్తు సారథిగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని కూడా అప్పట్లో చెప్పారు. మరికొన్ని ఐసీసీ టోర్నీలో రోహిత్ శర్మనే కెప్టెన్‌గా కొనసాగుతాడని కూడా స్పష్టం చేశారు. అయితే బోర్డర్




గవాస్కర్ ట్రోఫీ వైఫల్యం నేపథ్యంలో వైస్ కెప్టెన్సీ విషయంలో టీమిండియా మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో 32 వికెట్లతో ఒంటరి పోరాటం చేసిన బుమ్రాకు ప్రమోషన్ ఇస్తూ వన్డే ఫార్మాట్ వైస్ కెప్టెన్‌గా నియమించాలని నిర్ణయించినట్లు తెలిస్తోంది. దాంతో శుభ్‌మన్ గిల్‌పై వేటు పడనుంది. గతంలో రోహిత్ శర్మకు డిప్యూటీగా వ్యవహరించిన హార్దిక్ పాండ్యాకు కూడా అవకాశం లేకుండా పోయింది. 'ఛాంపియన్స్ ట్రోఫీలో భారత వైస్ కెప్టెన్‌గా జస్‌ప్రీత్ బుమ్రా వ్యవహరించనున్నాడు.'అని ఓ జాతీయ ఛానెల్ పేర్కొంది. గతంలో కొన్ని వన్డే సిరీస్‌ల్లో బుమ్రా డిప్యూటీగా వ్యవహరించాడు. 2022లో సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో బుమ్రా కేఎల్ రాహుల్‌తో డిప్యూటీగా వ్యవహరించాడు. 2023లో ఐర్లాండ్ పర్యటనలో భారత జట్టును నడిపించాడు.

# ఆ టోర్నీ తర్వాత గంభీర్‌పై వేటు?

టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై వేటు పడనుందా? అతని పనితీరుపై ఆగ్రహంగా ఉన్న భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) డెడ్‌లైన్ విధించిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అప్‌కమింగ్ ఐసీసీ టోర్నీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025పైనే హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ భవితవ్యం ఆధారపడి ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ టోర్నీలో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేస్తేనే గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా కొనసాగనున్నాడు. ఆసీస్ పర్యటన తరహాలో విఫలమైతే మాత్రం గంభీర్‌పై బీసీసీఐ వేటు వేయనుందని సమాచారం. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ పరాజయం అనంతరం గంభీర్ చేసిన వ్యాఖ్యలే ఈ వార్తలకు బలం చేకూర్చుతున్నాయి.

గంభీర్ మాటలతో..

టీమిండియా సీనియర్ క్రికెటర్ల రిటైర్మెంట్ గురించి ప్రశ్నించగా.. వారి భవితవ్యం గురించిమాట్లాడేందుకు గంభీర్ నిరాకరించిన విషయం తెలిసిందే. ఐదు నెలల తర్వాత టీమిండియాకు టెస్ట్ సిరీస్ ఉందని, అప్పటి వరకు ఎవరు ఎక్కడ ఉంటారో తెలియదని, జట్టు ట్రాన్సిషన్ గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుందని చెప్పాడు. ఈ వ్యాఖ్యలతో గంభీర్ హెడ్ కోచ్ పదవికి కూడా గ్యారెంటీ లేదనే విషయం అర్థమవుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025ని గంభీర్‌కు డెడ్‌లైన్‌గా విధించారనే సందేహం కలుగుతోంది.

గంభీర్ రాకతో గతి తప్పిన టీమిండియా..

టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం రాహుల్ ద్రవిడ్ వారసుడిగా హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టిన గంభీర్.. తొలి పర్యటనలోనే మిశ్రమ ఫలితాలను ఎదుర్కొన్నాడు. శ్రీలంక పర్యటనలో టీ20 సిరీస్ విజయాన్నందుకున్న గంభీర్.. వన్డే సిరీస్‌లో మాత్రం ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నాడు.

స్పిన్ వికెట్లపై భారత బ్యాటర్లు దారుణంగా విఫమవ్వడంతో మూడు




వన్డేల సిరీస్‌ను శ్రీలంక 2-0తో కైవసం చేసుకుంది. సుదీర్ఘ కాలం తర్వాత శ్రీలంక చేతిలో భారత్ వన్డే సిరీస్ కోల్పోయింది. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో టీ20, టెస్ట్ సిరీస్ గెలిచిన భారత్.. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై జరిగిన మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయ్యింది. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై టీమిండియా క్లీన్ స్వీప్ కావడం తొలిసారి. ఈ ఘోర పరాజయంతో హెడ్ కోచ్ గంభీర్‌పై విమర్శలు మొదలయ్యాయి.

ఆసీస్ గడ్డపై ఘోర పరాభావం..

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని విజయంతో ప్రారంభించిన భారత్.. ఆ తర్వాత నాలుగు మ్యాచ్‌ల్లో దారుణంగా విఫలమైంది. మూడో టెస్ట్‌ను వర్షం సాయంతో గట్టెక్కినా చివరి రెండు టెస్ట్‌ల్లో గెలిచే అవకాశాలు దక్కినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ క్రమంలోనే గంభీర్ కోచింగ్‌పై విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆశించిన ఫలితాన్ని సాధించకుంటే మాత్రం గంభీర్‌తో పాటు పలువురు సీనియర్ ఆటగాళ్లపై కూడా వేటు పడనుంది. గతంలో బెంచ్ ఆటగాళ్ల సాయంతో టెస్ట్ సిరీస్ గెలిచిన భారత్.. ఈ సారి కనీస పోటీ ఇవ్వలేకపోవడం గంభీర్ వైఫల్యాన్ని బయటపెడుతోంది.

# డోంట్‌వర్రీ.. ఆ మ్యాచ్ గెలిస్తే అందరూ మరిచిపోతారు: మహమ్మద్ కైఫ్

ఆస్ట్రేలియా పర్యటనలో పేలవ ప్రదర్శనతో డీలా పడిన భారత జట్టుకు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అండగా నిలిచాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధిస్తే.. తాజా పరాజయాన్ని అందరూ మరిచిపోతారని తెలిపాడు. అయితే జట్టులోని ఆటగాళ్లంతా దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సలహా ఇచ్చాడు.

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని టీమిండియా 1-3తో ఆసీస్‌కు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘోర పరాజయంతో టీమిండియాపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే టీమిండియా పరాజయంపై స్పందించిన కైఫ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో మెరుగైన ఫలితాలు సాధించకపోతే టీమిండియాను పరిమిత ఓవర్లు ఆడే క్రికెట్ జట్టుగా చూసే ప్రమాదం ఉందని హెచ్చరించాడు.

'ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌పై టీమిండియా విజయం సాధిస్తే ప్రశంసల జల్లు కురుస్తుంది. ఫిబ్రవరి 23న ఈ మ్యాచ్ జరగనుంది. ఈ విజయంతో తాజా పరాజయాన్ని అభిమానులు మరిచిపోతారు. అయితే భారత్ ఛాంపియన్‌షిప్ టోర్నీని గెలవాలంటే మాత్రం జట్టులోని ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. పేస్ ట్రాక్స్, స్పిన్ ట్రాక్‌లపై ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. డొమెస్టిక్ క్రికెట్ ఆడకుండా టెస్ట్‌ల్లో విజయాలు సాధించడం చాలా కష్టం.

ఆసీస్ పర్యటనలో భారత్‌కు ఎదురైన పరాజయాన్ని మేలుకొలుపుగా



భావించాలి. సుదీర్ఘ ఫార్మాట్‌లో మెరుగ్గా రాణించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. గంభీర్ తప్పిదం వల్లే భారత్‌కు ఓటమి ఎదురవ్వలేదు. ఇది సమష్టి వైఫల్యం. ప్రతీ ఒక్క ఆటగాడు రంజీ ట్రోఫీలో ఆడేందుకు ప్రయత్నించాలి. అయితే విశ్రాంతి పేరుతో కొందరు ఆటగాళ్లు రంజీ క్రికెట్ ఆడటం లేదు.

రంజీ ఆడకుండా.. ప్రాక్టీస్ చేయకుండా అత్యుత్తమ ప్రదర్శన ఎలా వస్తుంది? భారత్‌లో టర్నింగ్ ట్రాక్‌లపై ఆడటం కష్టం. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికాలో సీమ్ పిచ్‌లు ఉంటాయి. ప్రాక్టీస్ చేయకుండా ఈ కండిషన్స్‌లో రాణించడం కష్టం. టెస్ట్ క్రికెట్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.'అని టీమిండియా మేనేజ్‌మెంట్‌కు మహమ్మద్ కైఫ్ సూచించాడు.

# ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27..

వరుసగా మూడోసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ కు చేరాలకున్న టీమ్‌ఇండియాకు కంగారులు షాకిచ్చారు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సిరీస్‌ను భారత్ 1-3తో చేజార్చుకుంది.దీంతో టీమ్‌ఇండియా 2023-25 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించగా.. ఆస్ట్రేలియా తుది పోరుకు అర్హత సాధించింది. జూన్ 11 నుంచి ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ మైదానంలో దక్షిణాఫ్రికా, ఆసీస్ మధ్య ఫైనల్ జరగనుంది.ఇక, ఈ ఏడాది జూన్‌లోనే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ 2025-27 ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో వచ్చే డబ్ల్యూటీసీలో టీమ్‌ఇండియా మ్యాచ్‌ల షెడ్యూల్ వివరాలు బయటికి వచ్చాయి. ఇందులో భారత్ మొత్తం 18 టెస్టులు ఆడనుంది. స్వదేశంలో 9, విదేశీ గడ్డపై 9 టెస్టుల్లో తలపడనుంది. ఇంగ్లాండ్‌తో 5, వెస్టిండీస్‌తో 2, సౌతాఫ్రికాతో 2, శ్రీలంకతో 2, న్యూజిలాండ్‌తో 2, ఆస్ట్రేలియాతో 5 టెస్టులు ఆడనుంది. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనతో టీమ్‌ఇండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ మొదలవుతుంది. 2027 జనవరి-ఫిబ్రవరిలో స్వదేశంలో జరిగే బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌తో భారత జట్టు మ్యాచ్‌లు ముగుస్తాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**